# తీన్మార్

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 192 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 8 నవంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### బలహీనపడవచ్చని ఐఎండీ వెల్లడి

### నాలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని సూచనలు



తెలంగాణ బ్యూరో, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది తీరానికి చేరేసరికి బలహీనపడవచ్చని ఐఎండీ వెల్లడించింది. ఫలితంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడన ప్రభావంతో ఏపీలో రాబోయే

మిగతా 2 లో

## ఉద్యోగాల ప్రక్రియ విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు

### ప్రక్రియ మధ్యలో నిబంధనలను మార్చడం కుదరదు

ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల ప్రక్రియ విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. రిక్రూట్మెంట్ ప్రక్రియ మధ్యలో ఉండగా అర్హత ప్రమాణాలు, నిబంధనలను మార్చడం కుదరదని తేల్చి చెప్పింది. ఓ కేసుకు సంబంధించి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

న్యూ ఢిల్లీ, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): నియామక ప్రక్రియ ప్రారంభానికి ముందే నిబంధనలు ఏర్పాటు చేసుకుంటే ఆ తర్వాత వాటిని ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదని స్పష్టం చేసింది. నియామకాలకు ముందే ఆట నియమాలు గురించి చెప్పి మధ్యలో మార్చడం సబబు కాదని పేర్కొంది. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందులకు గురి

మిగతా 2 లో






# రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

### ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ



ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాదులోని అశోక్ నగర్ లో సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ప్రసంగించారు.

హైదరాబాద్, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఈ రాష్ట్రం కోరి కొట్లాడి తెచ్చుకున్నదే ఉద్యోగాల సాధన కోసం అని అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని

మిగతా 2 లో

## ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేయాల్సిందే

కృష్ణా, గోదావరి నుండి తెచ్చిన అభ్యంతరం లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేయాల్సిందే నీళ్లు ఇవ్వాల్సిందేనని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల నుండి తీసుకువచ్చిన

మిగతా 2 లో



## యాదగిరిగుట్టకు కుటుంబ సమేతంగా రానున్న సీఎం

### జన్మదిన సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు యాదగిరిగుట్టకు కుటుంబ సమేతంగా రానున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్టలో

మిగతా 2 లో


## ఫార్ములా-1 రేసింగ్ ఆరోపణలపై కేటీఆర్ వివరణ



### నగరాల చెంతకు హైదరాబాద్ను చేర్చే ప్రయత్నం చేసాం

హైదరాబాద్, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలో నిర్వహించిన ఫార్ములా-1 రేసింగ్ లో అవకతవకలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈ-రేస్ అనేది

మిగతా 2 లో



## భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

6 నెలల్లోనే అభివృద్ధి చేస్తాం

తొలి దశలో రూ. 30 కోట్లు మంజూరు

వరంగల్ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఓరుగల్లులో 600 ఏండ్ల కాలంనాటి భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోకస్‌పెట్టింది. సిటీ మధ్యలో ఎత్తైన కొండపై, సువిశాలమైన చెరువు ఒడ్డున

మిగతా 2 లో

## బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి ఈడీ నోటీసులు

### పీజీ మెడికల్ సీట్ల అక్రమాల కేసులో విచారణ



తెలంగాణ బ్యూరో, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి ఈడీ నోటీసులిచ్చింది. గురువారం పీజీ మెడికల్ సీట్ల అక్రమాల కేసులో ఈడీ విచారణ చేపట్టింది. ఈడీ విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి


మిగతా 2 లో



## బెంగళూరులో పర్యటించనున్న హైడ్రా బృందం

### చెరువుల పునరుజ్జీవనంపై అధ్యయనానికి పర్యటన

.. వివరాలు 2లో




## గాలి నాణ్యత, వాతావరణ మార్పులపై పీఎస్ఏ సమావేశం

న్యూ ఢిల్లీ, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం గురువారం న్యూఢిల్లీలో గాలి నాణ్యత మరియు వాతావరణ మార్పులపై వాటాదారుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ప్రాథమిక మరియు అనువర్తిత శాస్త్రం, నిర్వహణ మరియు విధాన జోక్యాలు రెండింటినీ విస్తరించి, బహుళ-విభాగ, సైన్స్-ఆధారిత, సమగ్ర పరిష్కారాన్ని అందించే సమగ్ర వనరుల ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి

మిగతా 2 లో

## రాష్ట్రంలో భారీగా డీఎస్పీల బదిలీలు

### ఈ మేరకు డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ

.. వివరాలు 2లో

## వివాదాస్పదంగా మారిన హిందీ పండిట్ల తొలగింపు

### 24 రోజులు డ్యూటీ చేశాక.. తొలగింపుతో ఆవేదన వ్యక్తం

### స్క్రూటినీలో అధికారుల నిర్లక్ష్యం.. తప్పు జరిగింది



.. వివరాలు 2లో

# రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

**మొదటి పేజీ తరువాయి**

చెప్పారు. ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందే తెలియజేస్తున్నామని ఆ పనిలో భాగంగా ఇప్పటికే గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో విజయవంతంగా ఉద్యోగాల భర్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధస్సు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యూపీఎస్సీ పరీక్షలను సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి మెయిన్స్‌కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహంగా అందించినట్లు తెలిపారు. మెయిన్స్ సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. సివిల్ సర్వీస్‌కు మన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపిక అయితే మన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సివిల్ సర్వీస్ అయినప్పటికీ పాలనలో మనవాళ్లు ఎంత ఎక్కువ మంది ఉంటే ప్రాంతీయ అభిమానంతో సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, ఇతర అంశాల ద్వారా మన రాష్ట్రానికి అంత ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందన్నారు. యూపీ క్యాడర్లో పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్ రావు, అరుణ ల ఆధ్వర్యంలో హైదరాబాదులో యూపీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఏ అంశాలపై దృష్టి పెట్టి, ఎలా చదివితే ఎంపిక అవుతామో తెలుసుకుంటే ఎక్కువమంది సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తర భారత దేశంలో ఎక్కువ అకాడమీలు అందుబాటులో ఉండడంతో ఆ రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్‌కు ఎక్కువమంది ఎంపిక అవుతున్నారని తెలిపారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావలసిన అవసరం ఉందన్నారు.






## ఫార్ములా-1 రేసింగ్ ఆరోపణలపై కేటీఆర్ వివరణ

**మొదటి పేజీ తరువాయి**

ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో జరుగుతోంది. అలాంటి నగరాల చెంతకు హైదరాబాద్ ను చేర్చాలని మేము ప్రయత్నం చేసాం. ఈ - రేస్ తెచ్చేందుకు చేసే ప్రయత్నంలో సియోల్, జోహెన్నస్ బర్గ్ ను తలదన్ని మన హైదరాబాద్ కు ఈ - రేస్ ను తెచ్చాము. దీనిని మేము ఒక రేసింగ్ గా మాత్రమే చూడలేదు. ఎలక్ట్రిక్ కార్లను ప్రమోట్ చేసి, ఎలక్ట్రిక్ వెహికిల్స్ కు మన హైదరాబాద్ ను అడ్డాగా మార్చాలని మేము ఈ-రేస్ ను ఒక అడుగుగా ప్రయత్నం చేశాం. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ పెంచేందుకు మన హైదరాబాద్ ను ఎలక్ట్రిక్ మ్యానుఫాక్చరింగ్ హబ్ గా మార్చే ప్రయత్నం చేసాం. ఫార్ములా %జు%-రేస్ కోసం పెట్టిన మొత్తం ఖర్చు రూ.150 కోట్లు దాని వల్ల హైదరాబాద్‌కు వచ్చిన లాభం రూ.700 కోట్లు వచ్చింది. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందో నాకు అర్థం కావడం లేదు అని కేటీఆర్ అన్నారు. హెచ్ఎండీఏ కు తెలియకుండా జరిగిందని మాట్లాడుతున్నారు కానీ నవంబర్ 14 న జీఓ కూడా ఇచ్చారు. హెచ్ఎండీఏ ఇండిపెండెంట్ బోర్డు. ఇందులో నిర్ణయాలు తీసుకోవాలంటే క్యాబినెట్ భేటీలో ఆమోదం తెలపాల్సిన అవసరం లేదు. హెచ్ఎండీఏ చైర్మన్ సీఎం, వైస్ చైర్మన్ మున్సిపల్ మినిస్టర్, ఎండీగా మెట్రోపాలిటన్ కమిషనర్ ఉంటారు. ఎన్నికల ముందు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్ కావద్దని ఫార్ములా ఈకి ఫండ్స్ రిలీజ్ చేయమని హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్ కు నేనే చెప్పాను. అవేమీ నాకోసం ఖర్చు పెట్టడానికి కాదు, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయస్థాయిలో నిలపడానికి చేశాను. ఇందులో అవినీతి జరిగిందని, కేటీఆర్ మీద కేసు పెడతామని అంటున్నారు. నా మీద ఎందుకు కేస్ పెడతారు? హైదరాబాద్ ను అంతర్జాతీయంగా పేరు తెచ్చినందుకు పెడతావా? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా? బెంగళూరు కన్నా ఐటీ ఎగుమతులను పెంచినందుకా? ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించినందుకా? ముందు సుంకిశాలలో గోడ కూలిపోయి 80 కోట్ల నష్టానికి కారణమైన మేఘ ఇంజనీరింగ్ మీద కేసు పెట్టు. రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడేది లేదు. కేసులు వేస్తే భయపడేది ఏం లేదు. జైల్లో పెట్టి పైశాచికానందం పొందుతా అంటే జైలుకు పోతా. జైల్లో యోగా చేసి బయటకు వచ్చిన తర్వాత పాదయాత్ర చేస్తా. అంతేగానీ దేనికీ భయపడేది లేదు. అసలు ఈ వ్యవహారంలో అవినీతి జరిగితేనే కదా నిరూపించడానికి కేవలం నన్ను జైలుకి పంపి పైశాచిక ఆనందం పొందుతా అంటే జైలుకు వెళ్ళడానికి సిద్ధం అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో భారీగా డీఎస్పీల బదిలీలు

తెలంగాణ బ్యూరో, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో 9 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో 9 మంది డీఎస్పీల బదిలీకి సంబంధించిన మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

1. జీ. మహేశ్ బాబు
ప్రస్తుత బాధ్యత: జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్బీ
కొత్త బాధ్యత: కరీంనగర్ డీఎస్పీ, పీటీసీ
2. బీ. రామానుజం
ప్రస్తుత బాధ్యత: కరీంనగర్ డీఎస్పీ, పీటీసీ
కొత్త బాధ్యత: కాగజ్నగర్ ఎస్డీపీవో
3. ఏ. కరుణాకర్
ప్రస్తుత బాధ్యత: కాగజ్నగర్ ఎస్డీపీవో
కొత్త బాధ్యత: అసిఫాబాద్ ఎస్డీపీవో
4. కే. క్రిష్ణ కిషోర్
ప్రస్తుత బాధ్యత: వనపర్తి డీఎస్పీ, డీసీఆర్బీ
కొత్త బాధ్యత: తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్డీపీవో
5. పీ. రవీందర్ రెడ్డి
ప్రస్తుత బాధ్యత: నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్బీ
కొత్త బాధ్యత: ఖమ్మం ఏసీపీ, సీసీఆర్బీ
6. డి. ప్రసన్న కుమార్
ప్రస్తుత బాధ్యత: ఖమ్మం ఏసీపీ, సీసీఆర్బీ
కొత్త బాధ్యత: మెదక్ ఎస్డీపీవో
7. ఎస్.ఆర్. దామోదర్ రెడ్డి
ప్రస్తుత బాధ్యత: వెయిటింగ్‌లో ఉన్న అధికారి
కొత్త బాధ్యత: అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీ
8. పి. సదయ్య
ప్రస్తుత బాధ్యత: అసిఫాబాద్ ఎస్డీపీవో
9. వి. సురేశ్
ప్రస్తుత బాధ్యత: తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్డీపీవో

కాగా, ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పి.సదయ్యను, తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వి.సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వీరంతా కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్టు చేయాలని డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేయాల్సిందే

**మొదటి పేజీ తరువాయి**

అభ్యంతరం లేదని తెలిపారు. ఒక్క ఇల్లు కూలగొట్టిన ఊరుకునేది లేదు. ఇల్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. రిటైనింగ్ వాల్ కట్టాలి సిటీలో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. తాము కులగణనకు వ్యతిరేకం కాదని 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో అమలు చేయాలని కోరారు. తన డీఎన్ఏ ఏంటో తెలంగాణ ప్రజలకు తెలుసు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. త్వరలోనే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ గెలువాలనే దృష్టిలోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతంలో బస చేస్తాం ఒకరోజు అక్కడే నిద్ర చేస్తాం అక్కడ ఉంటున్న వాళ్ళ ఇళ్లలో ఉంటాం, అక్కడే తింటామని పేర్కొన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బీజేపీ బృందాలు పర్యటిస్తాయని వెల్లడించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటినీ ఖతం చేస్తాం బీఆర్ఎస్ అవినీతి పై మోడీ స్వయంగా మాట్లాడారన్నారు. బీజేపీ లేకుండా తెలంగాణ రాజకీయాలు లేవని కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలోనే చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి అశ్విని వైష్ణవ్ వస్తారన్నారు. ఫ్లై ఓవర్లు, ఇతర ఇష్యూల పై సీఎంకి లేఖ రాస్తానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు



## యాదగిరిగుట్టకు కుటుంబ సమేతంగా రానున్న సీఎం

**మొదటి పేజీ తరువాయి**

కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టకు రానున్న సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సీఎం పర్యటన విజయవంతంగా సాగేందుకు అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుంది.

**వైటీడీఏ అధికారులతో సమీక్ష**

తన జన్మదినం సందర్భంగా మొదట కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా యాదగిరిగుట్టకు చేరుకుంటారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా పెండింగ్ పనులపై వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇంతవరకు ఆలయంలో జరిగిన అభివృద్ధి పనులు, పెండింగ్ లో ఉన్న పనులు ఏఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని వాటి గురించి అధికారులతో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

**వలిగొండ మూసీ నది వెంట పాదయాత్ర**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి పర్యటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలోని వలిగొండ నుంచి మూసీ నది వెంట పాదయాత్ర నిర్వహించనున్నారు. వలిగొండ మండలం సంగెం గ్రామం చేరుకుంటారు. మూసీ పరీవాహక ప్రాంత రైతులతో మూసీ నది వెంట పాదయాత్ర ద్వారా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శిస్తారు. అనంతరం మూసీ పరీవాహక ప్రాంత రైతులతో సమావేశం అవుతారు. ప్రభుత్వం మూసీ పునరుద్ధీవనం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో మూసీ నది వెంట సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర ప్రాధాన్యత సంతరించుకుంది.

**సీఎం హోదాలో రెండో సారి**

రేవంత్ రెడ్డి సీఎం హోదాలో రెండవసారి యాదగిరిగుట్ట క్షేత్రానికి రానున్నారు. మొదటగా మార్చి 11న యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున క్షేత్రాన్ని మంత్రులతో కలిసి దర్శించారు. తిరిగి తన జన్మదిన సందర్భంగా ఈనెల 8వ తేదీన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని సందర్శించనున్నారు. సీఎం హోదాలో ఆయన మొదటిసారి పుట్టినరోజు జరుపుకుంటున్నారు.

## నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



**మొదటి పేజీ తరువాయి**

నాలుగు రోజుల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ మధ్య బంగాళాఖాతం పై సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం నేడు నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతుంది. ఈ క్రమంలో దక్షిణ కోస్తా, రాయలసీమలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడి వర్షం పడనుందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే, గత వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతల్నించి ఉపశమనం కలగనుంది. అదే సమయంలో రాత్రి చలి మరి కాస్త పెరగవచ్చు. ఇప్పటికే తెలంగాణలో రాత్రి వేళ చలి తీవ్రత పెరిగింది. ఈ క్రమంలో వర్షాలు పడితే చలి తీవ్రత మరింత పెరగవచ్చు.

## వివాదాస్పదంగా మారిన హిందీ పండిట్ల తొలగింపు



ఖమ్మం జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఖమ్మం జిల్లాలో కొత్తగా రిక్రూట్ అయిన హిందీ పండిట్ల తొలగింపు వివాదాస్పదంగా మారింది. 24 రోజులు డ్యూటీ చేశాక తొలగించారని హిందీ పండిట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్క్రూటినీలో అధికారుల నిర్లక్ష్యంతో తప్పు జరిగిందని ఖమ్మం డీఈవో తెలిపారు. అర్హులకు అన్యాయం జరగొద్దనే వీళ్లను తొలగించామని చెప్పుకొచ్చారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ పేర్కొన్నారు. హిందీ ప్రవీణ, భూషణ్, విశారద సర్టిఫికెట్లు పనికిరావని ఖమ్మం డీఈవో చెప్పారు. ఇదిలా ఉండగా.. అధికారుల తీరుపై హిందీ పండిట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీ పండిట్ల సర్టిఫికెట్లు చెల్లవని ఇప్పుడు తొలగించారని, స్క్రూటినీలోనే సర్టిఫికెట్లు చెల్లవని ఎందుకు చెప్పలేదని బాధితులు నిలదీశారు. ఉద్యోగాలు వచ్చిన ప్రాంతాలకు కుటుంబాలను తీసుకెళ్లామని, ఉద్యోగాలు ఇచ్చి తొలగించడం భావ్యం కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు అపాయింట్ మెంట్లు.. ఇప్పుడు టెర్మినేట్ లెటర్లు ఇచ్చారని బాధిత హిందీ పండిట్లు లబోదిబోమంటున్నారు.

## భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

**మొదటి పేజీ తరువాయి**

ఉండే టెంపుల్ కొన్నేండ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. 6 నెలల్లోనే అభివృద్ధి చేస్తామంటూ బీఆర్ఎస్ హయాంలో 2022లో పనులు మొదలు పెట్టారు. సర్కారు దిగిపోయే నాటికి అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని టెంపుల్ ను టూరిజంసర్క్యూట్‌గా చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఆలయం చుట్టూ కొండలు, పార్కులు ఉండగా మూడు నాలుగు కిలోమీటర్ల పరిధిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోంది.

**తొలి దశలో రూ. 30 కోట్లు మంజూరు**

గ్రేటర్‌వరంగల్ తూర్పు, పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్లకు వారధిగా నిలిచే ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయం చుట్టూ మాడ వీధుల నిర్మాణానికి కావాల్సిన అనుమతులతో పాటు తొలిదశలో రూ.30 కోట్లు మంజూరు చేసింది. అయితే మూడు దిక్కులా కొండ, చెరువు, లోయ ఉండడంతో నిర్మాణ పనులకు అడ్డంకిగా మారింది. వానాకాలంలో భారీ వర్షాలు పడడంతో పనులు స్లో అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గత ఆదివారం పర్యటనకు వచ్చిన సందర్భంగా జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఆలయ మాడవీధులు, రాజగోపు రాల నిర్మాణ పనుల తీరును ఇన్ చార్జ్ మంత్రి స్వయంగా పరిశీలించారు. ఆగమ శాస్త్రం ప్రకారం పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**చెరువులో పూడికతీతకు ఆదేశం**

ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా 380 ఎకరాల్లో విస్తరించిన చెరువును కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వరదల కారణంగా చెరువులో మట్టి పేరుకుపోతుండడంతో లోతు తగ్గింది. వానాకాలం తప్ప వేసవిలో జలకళ కనిపించదు. దీంతో పూడికతీత తీయించాలని ఇన్ చార్జ్ మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్లాన్ వెంటనే రూపొందించడమే కాకుండా త్వరలోనే పనులు చేపట్టాలని సూచించారు. తద్వారా చెరువును తాగునీటికి అనుకూలంగా మార్చాలని తెలిపారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి హంటర్‌రోడ్, పద్మాక్షి టెంపుల్‌వైపు భారీగా భూకబ్జాలు జరిగిన నేపథ్యంలో సర్వే చేయించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి స్పష్టంచేశారు.

**పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి**

సిటీ మధ్యలో ఎత్తైన ప్రదేశంలో ఉండే భద్రకాళి టెంపుల్ ను ఆనుకుని ఉండే చెరువుకు హనుమకొండ వైపు పద్మాక్షి ఆలయ కొండలు హంటర్‌రోడ్‌వైపు ఆహ్లాదకరమైన భద్రకాళి బండ్‌ఉంది. రెండో విడత అభివృద్ధి పనులు సైతం కొద్దిరోజులుగా స్పీడప్ అయ్యారు. మాడ వీధులు, చెరువు పూడికతీత పూర్తయితే భద్రకాళి టెంపుల్‌నుంచి బోట్‌ద్వారా బండ్‌కు చేరుకోవచ్చు. అమ్మవారి దర్శనంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా త్వరలోనే తీర్చిదిద్దనున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై ఒకే ఒక్కడు పుస్తకం

### పుస్తకాన్ని ఆవిష్కరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్




హైదరాబాద్, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి పై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. ఈరోజు రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కేకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## ఉద్యోగాల ప్రక్రియ విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు

**మొదటి పేజీ తరువాయి**

చేయకూడదని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు కచ్చితంగా పారదర్శంగా, నిష్పక్షపాతంగా ఉండాలని బెంచ్ పేర్కొంది. 2008లో కే.మంజుశ్రీ తదితరులు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో రిక్రూట్‌మెంట్ ప్రక్రియల నియమాలను మధ్యలోనే మార్చలేమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో న్యాయస్థానం సరైనదేనని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రస్తావించింది.

## బెంగళూరులో పర్యటించనున్న హైడ్రా బృందం

హైదరాబాద్, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో చెరువులు, కుంటలు, బఫర్ జోన్లు, ఎఫ్టీల్ పరిధిలోని భూముల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన హైడ్రా ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు, బెదిరింపులకు తలొగ్గకుండా హైడ్రా స్వతంత్రంగా పనిచేస్తూ అక్రమార్కుల భరతం పడుతోంది. ఈ క్రమంలోనే బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్ర స్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, మురుగునీరు స్వచ్ఛంగా మార్చడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ లో అనుసరించిన విధానాలను పరిశీలించేందుకు కమిషనర్ ఏవీ రంగనాథ్ సారథ్యంలోని 'హైడ్రా' బృందం గురువారం నుంచి రెండు రోజుల పాటు బెంగళూరు లో పర్యటించనున్నారు. అక్కడ చెరువులను అధ్యయనం చేసి హైదరాబాద్ మహానగర పరిధిలోని ఉన్న బాచుపల్లిలోని ఎర్రగుంట చెరువు, మాదాపూర్‌లోని సున్నంచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని అప్పచెరువులకు పునరుజ్జీవం కల్పించనున్నారు. అదేవిధంగా భారీ వర్షాలు పడినప్పుడల్లా హైదరాబాద్ మహానగరాన్ని వరద నీరు ముంచెత్తడం, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులతో 'హైడ్రా' అధికారులు సమావేశం కానున్నట్లుగా తెలుస్తోంది.

## బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి ఈడీ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి**

హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మంత్రి మల్లారెడ్డి ఇంటిపై దాడులు చేసి సోదాలు చేసిన విషయం తెలిసిందే. పీజీ మెడికల్ సీట్లు అక్రమంగా బ్లాక్ చేశారన్న ఆరోపణలపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 45 మెడికల్ సీట్లు బ్లాక్ చేసి అమ్ముకున్నట్లు ఈడీ గుర్తించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వండి



తెలంగాణ బ్యూరో, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వండి ప్రమోషన్‌లో భాగస్వాములవ్వండి అని ఎన్ఆర్ఐ, పెట్టుబడిదాలను మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వాలని, తెలంగాణ పర్యాటక ప్రమోషన్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని, విదేశీయులు తెలంగాణ సందర్శించేలా ప్రోత్సహించి, పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని సూచించారు. లండన్ వేదికగా మూడు రోజుల పాటు జరిగిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ గురువారం ముగిసింది. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలంగాణ స్టాల్స్ ను సందర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో పర్యాటక రంగం ఎలా అభివృద్ధి చెందుతుందో కూడా తాము అధ్యయనం చేస్తున్నామని, తెలంగాణ పర్యాటకం సైతం అదే స్థాయికి చేరుకునేలా కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం లండన్‌లోని ప్రపంచ ప్రసిద్ధ చారిత్రాత్మక కట్టడాలు, స్మారక చిహ్నాలు, బిగ్ బెన్, లండన్ ఐ, బకింగ్ హామ్ ప్యాలెస్ ను మంత్రి సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, అనిరుధ్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాలి నాణ్యత, వాతావరణ మార్పులపై పీఎస్ఏ సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

చేయవలసిన ఆవశ్యకతను ఈ సమావేశం బలపరిచింది. ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, ఒక ప్రకటనలో, ఈ విధానం వాతావరణ మార్పులను తగ్గించడం మరియు ప్రజారోగ్యం రెండింటికీ సహ-ప్రయోజనాలను అందించగలదని పేర్కొంది. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ అధ్యక్షత వహించారు. తన ప్రారంభ ప్రసంగంలో, ప్రొ. సూద్ వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గాలి నాణ్యతను మెరుగుపరచడం యొక్క కీలకమైన ప్రాముఖ్యతను ఎత్తిచూపారు, ప్రజారోగ్యం మరియు పర్యావరణ సుస్థిరతకు దాని ముఖ్యమైన చిక్కులను నొక్కి చెప్పారు. వాయు కాలుష్యం అనేది అనేక అంశాలచే ప్రభావితమైన బహుముఖ సమస్య అని ఆయన నొక్కి చెప్పారు. ఎన్ఐఏఎస్ నిర్వహించిన అధ్యయనంలో కనుగొన్న విషయాలను ఆలోచనాత్మకంగా మార్చడం మరియు స్వల్ప మరియు దీర్ఘకాలిక కాల వ్యవధిలో సమర్థవంతమైన కాలుష్య నియంత్రణ కోసం సైన్స్-ఆధారిత వ్యూహాలను పొందుపరచడానికి మార్గాలను చర్చించడం కోసం సమావేశం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కూడా ఆయన నొక్కిచెప్పారు. ఈ సమావేశానికి వివిధ మంత్రిత్వ శాఖలు, సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# 1931 జనాభా లెక్కలేనా....

దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలన్నా.. వెనుకబడిన వర్గాలు ముందుకు వెళ్లాలన్నా.. కులగణన ఒకటే మందు అని చాలా మంది నమ్ముతున్నారు. జమానా లెక్కలు కాకుండా లేటెస్ట్ సెన్సెస్ తోనే అసలైన పేదల గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేయబోతున్న సర్వే దేశానికే రోల్ మోడల్ గా ఉ ంటుందంటున్నారుబీసీలకు రిజర్వేషన్లు, వారి జనగణన ఇష్యూ దేశవ్యాప్తంగా మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. దేశంలో బీసీల జనాభా లెక్కలు తీయాలన్న డిమాండ్లు ఈనాటివి కావు. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలు తీసేందుకు ముందుకు రావడం లేదంటున్నాయి విపక్షాలు. అసలు బీసీల్లో ఏయే కులాల్లో ఎంత మంది ఉన్నారన్న విషయం తెలిస్తే వారి సమగ్ర సంక్షేమానికి వీలవుతుందని బీసీ సంఘాల ఆలోచన. అందుకోసం బీసీ జనగణన ఒక్కటే మార్గమంటున్నారు.దేశ జనాభాలో ఎక్కువ శాతం బీసీలే ఉ న్నారు. బీసీల సంఖ్య 70 కోట్ల ఉన్నట్లు ఓ అంచనా ఉంది. ఆ లెక్కన ఇది 56 శాతం. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే ఇప్పటికీ బీసీ రిజర్వేషన్లు కొనసాగుతున్నాయంటున్నారు. పదేళ్లకోసారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, గిరిజనుల సంఖ్యపై మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏ ఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో 1931లో చేసిన జనాభా లెక్కలే సంపూర్ణంగా కులగణనలతో చేసిన సమగ్ర లెక్కలుగా ఉన్నాయంటున్నారు.ఇప్పటికీ అవే ఆధారంగా మారాయి. 1979లో బీపీ మండల్ నేతృత్వంలో రెండో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ బీసీల జనాభాను 52 శాతంగా లెక్కగట్టి వీరికి విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 1980లో రిపోర్ట్ ఇచ్చింది. ఈ సిఫార్సులు 1992 నుంచి అమల్లోకి వచ్చాయి. దేశంలో 3,743 కులాలను బీసీలుగా మండల్ కమిషన్ తేల్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ లిస్టులో 2,479 కులాలు మాత్రమే ఉన్నాయి. సర్వే చేస్తేనే బీసీల్లో ఉన్న కులాల లెక్క తేలే ఛాన్స్ ఉందంటున్నారు.2017లో జస్టిస్ రోహిణి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ను నియమించింది. ఓబీసీ జాబితాను వర్గీకరించడం ఈ కమిషన్ పని. ఇప్పటికి ఈ కమిషన్ గడువును 13సార్లు పొడగించారు. ప్రస్తుతం బీసీల జనగణనపై కాంగ్రెస్, జేడీయూ, సమాజ్ వాదీ సహా మరికొన్ని పార్టీలు అగ్రెసివ్ గా వెళ్తున్నాయి. వీలైన ప్రతిసారీ మోడీ సర్కార్ పై ఒత్తిడి పెంచుతున్నాయి. బీసీ కుల గణనతో చాలా లాభాలు ఉన్నాయని బీసీ సంఘాలు, విపక్షాలు అంటున్నాయి. వెనుకబడిన మెజార్టీ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయడం, జనాభాకు తగ్గట్లుగా విద్యా, ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం దొరకడం, బీసీల్లోని పేదలకు రిలీఫ్ లభిస్తుందని అంటున్నారు.సీన్ కట్ చేస్తే బీసీల లెక్కలు తీసేందుకు మోడీ ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు వస్తున్నాయి. కులగణనపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా వెనుకబడిన తరగతుల జనగణన చేపట్టడం పాలనాపరంగా కష్టమని తెలిపింది. అయితే దీన్ని విపక్షాలు, బీసీ సంఘాలు తప్పు బట్టాయి. బీసీ కులాల వారీ లెక్కలు తీస్తే అందరికీ రిజర్వేషన్లు కల్పించడం కష్టమన్న ఆలోచనతో ఉన్నారా అన్న డౌట్లు వస్తున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50 శాతం దాటొద్దని సుప్రీం తీర్పు ఉంది. ఆ లెక్కన చూసినా ఈ సబ్జెక్ట్ ముట్టుకుంటే మొదటికే ఇబ్బంది వస్తుందన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందా అన్నది కీలకంగా మారింది.నిజానికి 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు.. ఇదే బీజేపీ నాయకులు.. బీసీ కులాల వారిగా లెక్కలు తీయాలని పార్లమెంటులో డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. అటు బీసీల కులాల వారీ జనాభా లెక్కలు తీయడంతో పాటే పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆర్.కృష్ణయ్య వంటి నేతలు డిమాండ్ చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తేలాలంటే, బీసీల లెక్కలు తప్పనిసరిగా ఉండాలని గతంలో సుప్రీం ఆదేశించింది. లేకపోతే రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలు జరపాలని గతంలో తీర్పు ఇచ్చింది. దీంతో చాలా రాష్ట్రాల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. కొన్ని రాష్ట్రాలు సొంతంగా బీసీల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. ఇక తెలంగాణలో ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆయా ప్రాంతాలలోని జనాభాను బట్టి అక్కడ సిబ్బందిని నియమించారు. ఎన్యూమరేటర్ రోజువారీగా తనకిచ్చిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తయ్యే వరకు పనిచేస్తారు. నేటి నుంచి జరిగే ఈ సర్వేలో ప్రతి కుటుంబ యజమానిని నేరుగా ఎన్యుమరేటర్ కలిసి వివరాలు సేకరిస్తారు. యజమాని లేకుంటే తగిన ఆధారాలు చెప్పే ఏ కుటుంబ సభ్యుడున్నా సరిపోతుంది. ఇలా సేకరించిన సమాచారం మొత్తం ఈ నెల చివరి నాటికి ఆన్‌లైన్‌లో అప్లోడ్చేస్తారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయం, కుల, విద్య, ఉపాధి వంటి అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని వారికి చాటింపు, మైకుల్లో ప్రచారం ద్వారా తెలియజేస్తారు. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు.


# ప్రోగ్రాం డాక్టర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా



ములుగు జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ నిర్వహించడం జరిగింది. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు జిల్లా ఉపవైద్యాధిక శాఖ అధికారి డాక్టర్. విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్ ,డాక్టర్ భవ్య శ్రీ పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్బిఎస్కె ప్రోగ్రాం డాక్టర్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్స్ పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మరియు ఆర్బిఎస్కె ప్రోగ్రాం డాక్టర్లతో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ ఆరోగ్య సమస్య లతో వస్తున్న రోగులను, ఆప్యాయతతో పలకరిస్తూ, విలువలతో కూడిన వైద్య సేవలను అందించాలని వైద్యులను కోరారు .అప్పుడే వైద్య ఆరోగ్య శాఖ పట్ల ప్రజలలో నమ్మకం పెరిగి ఎక్కువమంది ప్రభుత్వ దావఖానకు వస్తారని తెలిపారు. అత్యవసర నిమిత్తము ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏమైనా పరికరాలు , అవసరం పడితే వాటిని కొనుగోలు చేసి వైద్య సేవలు అందించాలని, వాటికి బడ్జెట్ను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అటు తరువాత వైద్య శాఖ చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పై ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును తెలుసుకొని, నిర్దిష్టమైన ప్రణాళికతో, ఒక కాల పరిధిని ఎంచుకొని కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ గారు డాక్టర్లకు తెలిపారు. ఎవరు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించకూడదని తెలిపారు. అటు తరువాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావు మాట్లాడుతూ ఆరోగ్యంతో బాధపడుతున్న వారు టెలి మానస్ ఫోన్ కాల్ అను వినియోగించుకోవాలని, అలాగే పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం మీద అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమము లో వచ్చే మహిళలకు క్యాన్సర్ల మీద, థైరాయిడ్ మధుమేహము మొదలగు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ వారికి వైద్య సేవలు అందించాలని వైద్యాధికాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్స్ మరియు ఆర్ బి ఎస్ కే డాక్టర్స్ డెమో సంపత్, ఎన్ హెచ్ ఎం తిరుపతిరెడ్డి ,కిరణ్ మొదలగువారు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు అధిరోహించేలా బోధన ఉండాలి

## ఎంఈఓ ఇంజమూరి కాటయ్య



పాలకవీడు, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయి కాంప్లెక్స్ సమావేశాలలో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల జీవశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం,పాలకవీడు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాన్ పహాడ్ లో గురువారం రోజున నిర్వహించటం జరిగింది. నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలక వీడు మండలాల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జీవశాస్త్రం బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల బోధనా అభ్యసనను మెరుగు పరుచుకొనే కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది అని ఎంఈఓ ఇంజమూరి కాటయ్య అన్నారు. ఈ సమావేశాల్లో జీవశాస్త్ర ఉ పాధ్యాయులు బోధనలో కొత్తమెళకువలను నేర్చుకొని, నూతన సిలబస్ కి అనుగుణంగా బోధన జరపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో వైద్య విద్యను అభ్యసించాలనే సంకల్పం బలపడాలంటే,జీవశాస్త్ర బోధన నూతనం మార్గాల్లో కొనసాగాలని సూచించారు. మన చుట్టు ఉండే పరిసరాలలో ఉండే జంతు వృక్ష జాతుల అధ్యయనం పై విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా విద్యార్థి ఆధారిత బోధనాభ్యసన కృత్యాలను చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొండా లింగయ్య, ఉ పాధ్యాయులు బూర వెంకటేశ్వర్లు,శౌరీ, శ్రీనివాసరెడ్డి, సైదయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేకు అందరూ సహకరించాలి

## – జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటన లో కోరారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించే స్టిక్కర్ల పై ఇంటి నెంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను నమోదు చేసి, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి సర్వే చెసి 88, 071 ఇండ్లను గుర్తించి, 902 ఎన్యూమరేషన్ బ్లాక్ లలో 84, 757 ఇండ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించే స్టిక్కర్ల ను 96.24శాతం పూర్తి చేయడం జరిగిందనీ ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

# భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులకు ధన్యవాదాలు: మంత్రి సురేఖ



వరంగల్ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఎయిర్ పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు ఒప్పుకున్న రైతులు, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు. రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించేందుకు కావలసిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలను పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేసి మౌలిక సదుపాయాల కల్పనకు, పరిహారం చెల్లింపుకు సమగ్ర నివేదికను రూపొందించి మంజూరి నిమిత్తం ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి సురేఖ ఆదేశించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ చారితాత్మక వరంగల్ నగరాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేయుటకు ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారని ముఖ్యంగా విమానాశ్రయం ఏర్పాటు కు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారని అన్నారు. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా సరైన రవాణా వ్యవస్థ ఉండాలని, విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దీనితోపాటు నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్వే లైన్ల ఏర్పాటు జరుగుతున్నదని అన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు రైతులు అమూల్యమైన భూమిని త్యాగం చేయడం సంతోషదాయకమని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి ద్వారా కావలసిన నిధులు మంత్రి కొండా సురేఖతో కలసి మంజూరు చేయిస్తామని అన్నారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అన్నారు. విమానాశ్రయం, రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్, నగర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటుతో అభివృద్ధిలో వరంగల్ రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. ఎయిర్పోర్ట్ ఏర్పాటు కావడం తలమానిక మన్నారు. సహకరించి ఏర్పాటు ఏర్పాటుకు భూములప్ప గిస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భూములు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని అన్నారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు, సహకరించి భూములను ఇస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి పరిచి వారి అంగీకారం మేరకు ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారని చెప్పారు. మంత్రి కొండ సురేఖ సారథ్యంలో రైతులు సహకరించి ఎయిర్పోర్ట్ నిర్మాణానికి తమ భూములను ఇస్తున్న రైతులకు సరైన న్యాయం జరిగేలా మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భూమి సర్వే చేసి పూర్తిగా మ్యాపింగ్ చేస్తామని ప్రస్తుతమున్న ధరలు, కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ విక్టర్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, బైరబోయిన ఉమా దామోదర్, భోగి సువర్ణ సురేష్, ముష్కమల్ల అరుణ సుధాకర్, ఓని స్వర్ణలత భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ రవి, పురా?న్, ఆర్ అండ్ బి, ఎస్ సి, నాగేందర్ రావు, ఈఈ జితేందర్ రెడ్డి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్ రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ మహబూబ్ నగర్ డిఇఓ రవీందర్



మహబూబ్ నగర్ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా డీఈవో రవీందర్ ఒక ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఒక ఉపాధ్యాయుడికి దక్కవలసిన సీనియారిటీ దక్కకపోవడంతో తనకు న్యాయం చేయాలని పలుమార్లు డీఈఓకు విజ్ఞప్తి చేశారు. 50,000 లంచం డిమాండ్ చేయడంతో ఆ ఉ పాధ్యాయుడు ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్ ను ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం ఉదయం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న డీఈవో ఇంటికి వెళ్లి 50 వేల రూపాయలు ఇస్తుండగా డీఎస్పీ కృష్ణ గౌడ్ బృందం డీఈఓను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం 50 వేల రూపాయలు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు..

# పోగొట్టుకున్న ఫోను అందించిన ఎస్ఐ లక్ష్మీనరసయ్య



పాలకవీడు, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రానికి చెందిన కొండ సురేష్ తండ్రి అచ్చయ్య నెలరోజుల క్రితం అతని మొబైల్ ఫోను పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక పాలకవీడు ఎస్సై లక్ష్మీనరసయ్య సి.ఈ.ఐ. ఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ని రికవరీ చేసి బాధితుడు సురేష్ కి అందజేశారు. అనంతరం ఎస్.ఐ. లక్ష్మీ నరసయ్య కు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# లయన్స్ విజన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటి పరీక్ష



## – కంటి పరీక్షలో పాల్గొన్న 70 మంది స్థానికులు
## – తీన్మార్ మల్లన్న టీమ్ మండల అధ్యక్షులు తీన్మార్ జై

శాయంపేట, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): గురువారం మండలంలోని సూర్య నాయక్ తండ గ్రామంలో ఉచిత కంటి పరీక్ష మరియు ఆపరేషన్ శిబిరం తీన్మార్ మల్లన్న టీం శాయంపేట మండల అధ్యక్షులు మరియు సూర్య నాయక్ తండా గ్రామ యూత్ అధ్యక్షులు తీన్మార్ జయ్ ఆధ్వర్యంలో లయన్ విజన్స్ క్లబ్ వారి చేతులమీదుగా ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జై మాట్లడుతూ సూర్య నాయక్ తండ గంగిరెని గూడెం గొల్లపల్లి మరియు నిజాంపల్లి గ్రామస్తులు వారి యొక్క కంటిలో ఉన్న సమస్యలు చూపించుకొని వారి యొక్క సందేహాలను అడిగి తెలుసుకుని త్వరిత గతిన వైద్యం చేసుకోవాలని అన్నారు, మరియు ఈ క్యాంపు లో 70 మంది పాల్గొన్నారు. అదేవిధంగా తీన్మార్ జయ్ నీ గ్రామస్తులు అభినందించారు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గోన్నారు.

# ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి

## – సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్
## – పార్టీ నారాయణపేట జిల్లా మహాసభలో నూతనకమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్: నారాయణపేట– మక్తల్ –కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. సీపీఐ(ఎం) నారాయణపేట జిల్లా ద్వితీయ మహాసభ మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగింది. ఈ సందర్భంగా సాగర్ ప్రసంగించారు. ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగుకు నీరందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా జి.వెంకటరామిరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులుగా గోపాల్, అంజలాగౌడ్, పుంజనూరు ఆంజనేయులు, బాలరామ్, జిల్లా కమిటీ సభ్యులుగా గోవింద్ రాజ్, జోషి, కాశప్ప, నరహరి, అశోక్, బాలప్ప, దస్తప్ప, బొమ్మన్‌పాడ్ బలరామ్, మహ్మద్ అలీ, శివకుమార్‌ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో ఆర్‌పిఎమ్ నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**- రైతులకు అవగాహన కల్పించాలి**



ములుగు జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో 18-20 ఆర్‌పిఎమ్ నిర్వహించాలనీ, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో 2024-25 ఖరీఫ్‌లో పంట కోతలో పాల్గొన్న హార్వెస్టర్ యజమానులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పి షభరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్ మహేందర్ జిలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో 18-20 ఆర్‌పిఎమ్ నిర్వహించాలనీ సూచించారు. తద్వారా మంచి వరి వస్తుందనీ, తాలూ, పండని ధాన్యం కూడా తొలగించబడుతుందనీ తెలిపారు. హార్వెస్టర్ ఈ విధానాన్ని అనుసరిస్తే, రైతులు వరి సగటు నాణ్యత కోసం మళ్లీ వరిని శుభ్రం చేయాల్సిన అవసరం ఉండదని, రైతులకు ఖర్చులు తగ్గుతాయనీ అన్నారు. అన్ని మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టర్ యజమానులతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, రైతులకు అవగాహన కల్పించాలనీ తహశీల్దార్లందరికీ కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, ధాన్యం కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుందా, గన్నీ సంచులు అందినాయా, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయా, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు అయిన రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను కూడా రైతులకు ప్రతిరోజు అధికారులు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ ఎన్.వెంకటేష్, డిసిఎస్ఓ షా ఫైజల్ హుసేని, డిఎండిసిఎస్ఓ రాం పతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, %ణవీ%, గిరిజన సహకార కార్పొరేషన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, తహసిల్దార్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ నితీష్, హార్వెస్టర్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను అందించాలి

**- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి**

**- అధికారులు అంకితభావంతో పని చేయాలి**

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి**



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): గురువారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూర్ మండల కేంద్రం, మహబూబాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. దంతాలపల్లి మండలం కేంద్రంలోని సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జనగామ, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో కలిసి తొర్రూరులోని మిషన్ భగీరథ అతిథి గృహంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, సన్న రకాలకు సర్టిఫై చేసి కొనుగోళ్లు చేయలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలని, పాలకుర్తి పరిధిలోని ఇరిగేషన్ రిజర్వాయర్లు, కెనాల్లు, ఏదైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయాలని కొత్త పనులకు అవసరం ఉన్న చోట ప్రతిపాదనలు పంపాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విభాగాలలో పెండింగ్లో ఉన్న పనులు,ను వెంటనే పూర్తి చేయాలని సిసి రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, మహబూబాబాద్ జనగామ జిల్లా పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలల మంజూరుకి స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు వెంటనే పంపాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో భూ అక్రమణాలను గుర్తించి సంబంధిత వారికి నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెండు పడకల గదుల నిర్మాణం ఎన్ని సిద్ధంగా ఉన్నాయో గుర్తించి పంపిణీకి సిద్ధం చేయాలని, మిగతా అవసరమైన రెండు పడకల గదులకు నిర్మాణం కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విధులలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందించే సేవలపై స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లు సూచనల మేరకు విధులు నిర్వహించాలని, మంత్రి అధికారులకు సూచించారు.

ప్రజలకు విద్యుత్, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత అధిక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, పాలకుర్తి శాసన సభ్యురాలు హనుమండ్ల యశస్విని రెడ్డి, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, మహబూబాబాద్ జనగామ జిల్లా కలెక్టర్లు అద్వైత్ కుమార్ సింగ్, రిజ్వాన్ భాషా షేక్, తదితర సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కులగనన సర్వే కార్యక్రమం దేశానికి ఆదర్శం

**- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



పరకాల, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కులగనన సర్వే కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గురువారం ఇంటింటా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వెనుకబడిన వర్గాల ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూములేటర్ ను నియమించారని వారు ప్రతి ఇంటికి వచ్చి స్టిక్కర్ వేసి సర్వ్ కు కావల్సిన పత్రాలను. ముందుగా వివరిస్తారని అన్నారు. సర్వే ద్వారా సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికి సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదని ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# కనీస మద్దతు ధరకు సీసిఐ ద్వారా
# పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): రైతులకు కనీస మద్దతు ధర చెల్లించేందుకు సీసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం మల్హర్ మండలం మార్కెట్ యార్డు, కాటారం మండలం, కాటారం గ్రామంలో సీసిఐ ఆధ్వర్యంలో మీనాక్షి ఆగ్రో కాటన్ కాటన్ మిల్లును ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. మన దేశంలో చాలామంది రైతులు పత్తి పండిస్తున్నారని, తద్వారా పెద్ద ఎత్తున పత్తి సాగువుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇంపోర్ట్ చేయడం వల్ల ధర తగ్గి రైతులకు ఇబ్బంది జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. రైతులకు అన్యాయం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇంపోర్టును పూర్తిస్థాయిలో బంద్ చేయాలని ఆయన తెలిపారు. రైతులు మద్దతు ధర కల్పించాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు ఇస్తున్నారని తెలిపారు. 7521 రూపాయలు క్వింటాలకు తీసుకునే తరుణంలో ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మార్కెటింగ్ అధికారి కనక శేకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా రాజకీయ శిక్షణను జయప్రదం చేయాలి


**- ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు**




డిండి, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఈ నెల 11న జరిగే ఏఐటీయూసీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. 07.11.2024 నాడు డిండి మండలంలో ఏఐటీయూసీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను రాస్తూ 29 కోడ్లు ఉన్న చట్టాలను నాలుగు కోడ్లుగా కుదించి కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం 192 0 అక్టోబర్ 31వ తేదీన ఏర్పడినటువంటి భారతదేశంలో మొట్టమొదటి సంఘం ఏఐటియుసి ఆనాటి నుంచి నిత్యం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ,చట్టాల కోసం అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి కార్మికుల నెత్తుటి మరకల పై నిర్మించినటువంట సంఘం ఏఐటియుసి మిర్యాలగూడ కరీం ఫంక్షన్ హాల్లో సోమవారం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని, కార్మికులు సమయాన్ని పాటించవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు భు ష్పక లింగమయ్య ,భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎలిమినేటి దేవయ్య, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు రామావత్ జోహార్ లాల్, బాలరాజు, అంజి, కిన్నెరగంగమ్మ, వంగూరి, సిపోరా, జంతుకభాగ్యమ్మ, ఔట లక్ష్మమ్మ, అవుట నీలమ్మ, అవుట సాలమ్మ కటికర్ల లక్ష్మమ్మ, అవుట సైదమ్మ, అవుట బాలమ్మ, అవుట చెన్నమ్మ, జహంగీర్, సుగూరి ఆంజనేయులు, తదిరులు పాల్గొన్నారు.

# గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**



జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కేంద్రాల ఏర్పాట్లు, సెక్యూరిటీ, పరీక్షా విధానం మరియు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న పరీక్షకు 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా పేపర్లు భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరీక్ష పర్యవేక్షణ కో ఆర్డినేటర్ వెంకన్న, అదనపు కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, కలెక్టరేట్ ఏఓ ఖాజా మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటా

**జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్**



ఏటూరునాగారం, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లెల మూర్తి అనారోగ్య కారణంతో మరణించడం జరిగింది. ఆ విషయాన్ని తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వాళ్ల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం 20.000 రూపాయలు అందజేయడం జరిగింది మరియు. ఇటీవల మరణించిన అట్టెం నాగరాజు కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ మీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గడదాసు. సునీల్ కుమార్ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి కాకులమర్రి ప్రదీప్ బాబు తాడూరి రఘు. తాటి కృష్ణ. ఎండి ఖాజా పాషా. మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి. సప్పిడి రామ్ నరసయ్య. మాదరి రామయ్య. కుమ్మరి చంద్రబాబు. జాడి బోజారావు. కాళ్ల రామకృష్ణ. గండేపెల్లి నర్సయ్య. కాకులమర్రి భాస్కరరావు. ఖలీల్. ముస్తఫా. కొండాయి గ్రామ కమిటీ అధ్యక్షులు. పాయం రాకేష్. మందపల్లి సాగర్. పడదల మహేందర్. లక్ష్మణ్. నర్సింగరావు. నాగరాజు. రాంబాబు నానాజీ. మరియు బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది

# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎస్సీ,ఎస్టీ కేసుల పై కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన రివ్యూ మీటింగ్ హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్న ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సభ్యులనుదేశించి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు భారత రాజ్యాంగం, చట్టప్రకారం ఉన్నటువంటి హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేస్తున్నటువంటి కృషి గురించి వివరించారు. పౌర హక్కుల దినం రోజున కేవలం ఎస్సీ ఎస్టీ హక్కుల కోసం మాత్రమే కాకుండా వారి సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలలో ప్రథమ ప్రాధాన్యత ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వాలు ఇస్తున్నాయని, 33శాతం సబ్సిడీతో వ్యవసాయ ఉద్యానవన శాఖల్లో పథకాలు ఉన్నాయన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పథకంతో పాటు, వ్యక్తిగత ఆర్థిక అభివృద్ధి కోసం పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, వంటి పథకాలు ఉన్నాయని, అధికారులు ఎస్సీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక జిల్లా కోర్టు ఏర్పాటు కోసం సభ్యులు జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ విషయం హైకోర్టు పరిధిలో ఉంటుంది కాబట్టి జిల్లా జడ్జికి వినతిపత్రం అందిస్తామని కలెక్టర్ వివరించారు. జిల్లా ఏర్పాటు సమయంలో అప్పటి కలెక్టర్ చుంచుపల్లి లో సేవాలాల్ ధ్యాన మందిరం ఏర్పాటుకు స్థలం కేటాయించారని, కానీ ఇప్పటివరకు కార్యచరణ రూపొందించలేదని తెలిపారు. కలెక్టర్ చుంచుపల్లి తాసిల్దార్ ను పరిశీలించవలసినదిగా ఆదేశించారు. భద్రాచలం మొబైల్ కోర్టులో జడ్జి లేకపోవడం వల్ల అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయని, నియామకానికి తగిన చర్యలు చేపట్టాలని సభ్యులు తెలియజేశారు. దీనికిగాను కలెక్టర్ ఈ అంశం ప్రభుత్వం పరిచయంలో ఉందని, వీలైనంత త్వరగా జడ్జి నియామకం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏ పీ ఓ జనరల్ ఐటీడీఏ డేవిడ్ రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, సిపిఓ సంజీవరావు, కలెక్టరేట్ ఏవో రమాదేవి, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు ఎనుమురి లక్ష్మీబాయి, చింతల రవికుమార్, లౌడియా సామ్య లకావత్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన అధికారులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో నిర్మించనున్న ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిజి ఐఐసి) మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అమలు పద్ధతులు మరియు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. కాలేజీ నిర్మాణం పటిష్టంగా, నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు, శిక్షణా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సాఫీగా భద్రకాళి చెరువు నీరు విడుదల

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): భద్రకాళి చెరువు నీటిని సాఫీగా విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులకు ముందస్తు చర్యలలో భాగంగా శుక్రవారం నుండి చెరువు నీటి విడుదల నేపథ్యంలో గురువారం హనుమకొండ కాపువాడ సమీపంలో ఉన్న భద్రకాళి చెరువు మత్తడితో పాటు కాపువాడ వద్ద ఉన్న నీటి కాలువ, ఎస్టిపి కోసం రెడ్డి పురం జంక్షన్ ప్రాంతంలో గతంలో సాగు నీటిపారుదలశాఖ కెనాల్ కోసం మట్టి తీసిన ప్రాంతాన్ని, హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలోని పెద్ద చెరువును హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు నీరు విడుదలకు సంబంధించిన పలు అంశాలపై సాగునీటి పారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మీడియాతో మాట్లాడుతూ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతో నిండిపోయిందని, దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతూ వస్తుందని ఇదే విషయం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు పాల్గొన్న సమావేశంలో వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. దీంతో భద్రకాళి చెరువు పూడికతీత పనులు, చెరువు చుట్టూ ఇతర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆదేశాలు అందినట్లు తెలిపారు. భద్రకాళి చెరువులో పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని మత్తడి ద్వారా ప్రతిరోజు విడుదల చేయనున్నట్లు తెలిపారు. భద్రకాళి చెరువు నీరు నగరంలోని కాల్వ ద్వారా హస న్ పర్తి మండలం నాగారంలోని పెద్ద చెరువుకు చేరుతుందన్నారు. ఒకవేళ నాగారం చెరువు భద్రకాళి చెరువు నుండి వచ్చే నీటితో నిండినట్లయితే ఇప్పటివరకు ఏ విధంగానైతే మత్తడి నుండి కింది ప్రాంతానికి వాగు ద్వారా ఏ విధంగా అయితే వెళ్తుందో అలాగే వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు, రైతులకు, పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీటి ప్రవాహం సాఫీగా ఉండేటట్టు సాగునీటిపారుదల శాఖ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపడతారన్నారు. కల్వర్టుల వద్ద, కాల్వలలో చెత్త చెదారం, ఇతర ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భద్రకాళి చెరువు నీటిని పెద్ద మొత్తంలో కాకుండా తక్కువ పరిమాణంలో శుక్రవారం నుండి విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. కాలువల పక్కన ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 10-15 రోజుల్లో భద్రకాళి చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో తీసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. భద్రకాళి చెరువులోని నీటిని తీసే ప్రక్రియను జాగ్రత్తగా చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. భద్రకాళి చెరువులో పూడిక తీయడం వలన నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందని, చెరువు నీరు బాగుండనుందని పేర్కొన్నారు. భద్రకాళి చెరువు పూడికతీయడం వలన రానున్న రోజుల్లో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. చెరువు నీటిని తీసేసిన అనంతరం పూడికతీత పనులు జరుగుతాయని అన్నారు. భారీ వరదల కారణంగా మురుగునీరు కొంతమేరకు వస్తుందని, మిగతా సమయాల్లో మురుగునీరు అందులో చేరదన్నారు. చెరువు పూడికతీత అనంతరం రానున్న రోజుల్లో బొంది వాగు ప్రాంతం నుండి మురుగునీరు చేరకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మురుగునీటి విషయంలో ఎస్ టి పి ప్లాన్ కోసం మంత్రులు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఈ సీతారాం, మున్సిపల్ డిఈ సంతోష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సర్వేలో దేశానికే ఐకాన్ గా తెలంగాణ

## వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే దేశానికే ఐకాన్ గా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట చౌరస్తా కూడలి వద్ద సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే పై ఎన్యుమరేటర్ల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సర్వే చేపడుతుండగా ప్రజలందరూ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. సర్వేతో భవిష్యత్తులో ప్రజలకు ఎన్నో లాభాలు కలుగుతాయన్నారు. రాజకీయంగా ఆర్థికంగా ఇలా ఎన్నో విధాలుగా ఈ సర్వే దోహదపడుతుందన్నారు. మూడు రోజులపాటు ప్రతి ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు స్టిక్కర్లను వేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఎక్కడ కూడా విస్మరించకుండా సమగ్ర వివరాల కోసం ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వస్తారన్నారు. ఏ కుటుంబమైన ఎక్కడికైనా వెళ్లిన కూడా తిరిగి వచ్చి సర్వే వివరాలను నమోదు చేయించుకోవాల న్నారు. సర్వే పైన ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. వారం రోజులుగా సర్వేపై విస్తృత ప్రచారాన్ని అధికార యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తో దేశంలోనే రాష్ట్రం ఐకాన్ గా ఉండాలని ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టారని అన్నారు. ఈ సర్వే గురించి తన చుట్టుపక్కల వారికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం లో చేపట్టిన ఈ సర్వే దేశానికి దిక్సూచిగా మారబోతుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం సర్వేలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో సగం గ్రామీణ ప్రాంతంతో పాటు మరో సగ భాగం పట్టణ ప్రాంతంగా మిళితమై ఉందని పేర్కొన్నారు. సర్వే చేపట్టేందుకు జిడబ్ల్యూఎంసి పరిధిలో 800 వరకు ఎన్యూమరేషన్ బ్లాకులుగా గుర్తించామని అన్నారు. ఎన్యుమరేషన్ బ్లాకుల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లను ఎన్యుమరేటర్లుగా నియమించడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్లు సర్వే చేస్తుండగా పర్యవేక్షించేందుకు సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే అనేది రెండు భాగాలుగా జరుగుతుందన్నారు. మొదటి దశలో మూడు రోజులపాటు ప్రతి ఇంటికి స్టిక్కర్ ను అతికించడం జరుగుతుందన్నారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికించిన అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబం యొక్క సమగ్ర వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారని చెప్పారు. ఎన్యుమరేషన్ బ్లాక్ లోని ప్రతి ఇంటికి స్టిక్కర్ను తప్పనిసరిగా అంటిస్తారని, వచ్చేవారం సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్ కు సరైన వివరాలను ఆయా కుటుంబాల వారు తెలియజేయాలన్నారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పాస్ బుక్‌లు ఉన్నట్లయితే సర్వే కు సంబంధించిన సమాచారాన్ని ఎన్యుమరేటర్ కు ఇవ్వడానికి సులువుగా ఉంటుందన్నారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వేలో సరైన వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో సామాజిక ఆర్థిక సర్వే కు ప్రజలు సహకరించాలన్నారు. కాజీపేట వాటర్ ట్యాంక్ సమీపంలో సామాజిక ఆర్థిక సర్వే స్టిక్కర్లను ఎన్యూమరేటర్లు ఇంటింటికి అతికిస్తుండగా ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, కాజీపేట తహసిల్దార్ బావ్ సింగ్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కుటుంబ సర్వే ప్రక్రియ పర్యవేక్షణ

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్



జనగామ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): గురువారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ, శ్రీమన్నారాయణపురం, బాంజీపేట, కంచనపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన సన్న, దొడ్డు రకం ధాన్యం తేమ శాతం, తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. అలాగే సరిపడా టార్పాలిన్లు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కాంటా అవ్వగానే ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ఓపీఎంఎస్ లో వెంటనే నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్ లను తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు. అనంతరం అదే మండలంలోని నిడిగొండ గ్రామ పరిధిలో గల ఎస్సీ, బీసీ కాలనీల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సర్వే చేసి స్టికర్ లను సక్రమంగా అతికించాలని ఎన్యూమరేటర్ లకు సూచించారు. ఈ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కేంద్రాల పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో ఫేక్ మెసేజ్ లు

- మోసపూరితమైన మెసేజ్ లను నమ్మొద్దు
- వెంటనే మెసేజ్ బ్లాక్ చేయండి: కలెక్టర్ దివాకర టి. ఎస్






ములుగు జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారు. ఈ ఖాతాను ఉపయోగించుకుని పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. కలెక్టర్ దివాకర టి. ఎస్. పేరు, ఫొటోతో ఫేస్ బుక్ ఐడీని సృష్టించి సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్టు పంపిస్తున్నారు. వారు అక్సెప్ట్ చేసిన అనంతరం మెస్సెంజర్ లో మెసేజ్ లు పలువురికి మేసేజ్‌లు పంపించారు. దీన్ని గమనించిన కలెక్టర్ దివాకర టి.ఎస్. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగిన ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. పై నంబర్ మోసపూరితమైనది, దయచేసి జవాబు ఇవ్వకండి. మరియు వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రతి ఒక్కరినీ కోరారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబర్ కేటుగాళ్ల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## ఈ నెల 9, 10న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



జనగామ జిల్లా, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం - 2025 క్యాంపెయిన్ ను అర్హులైన జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే 18 సంవత్సరాలు నిండిన వారు (లేదా) 01 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఫారం 6 కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి,ఫారం 7 జాబితాలో అభ్యంతరాలు తెలపడానికి, ఫారం 8 ఓటరు వివరాల్లో సవరణలు చేయడానికి (ఇంటి చిరునామా మార్పు, సవరణలు, కొత్త ఎపిక్, దివ్యాంగులుగా గుర్తింపు మొదలైనవి). ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలు ఈ నెల 9, 10 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు (%BLO%) ఆయా పోలింగ్ బూత్ ల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటరు వివరాలను సరిచేసుకోవడం (లేదా) కొత్త ఓటరుగా నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు చేసుకునే మరిన్ని మార్గాలు voters.eci.gov.in వెబ్సైట్ ద్వారా (లేదా) Voter Helpline మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# ధాన్యం వివరాలను జాప్యం చేయవద్దు

నల్గొండ: కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.
బుధవారం ఆయన నకిరేకల్ మండలం తాటికల్, చీమల గడ్డ, కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాలలో తేమ శాతాన్ని,సౌకర్యాలను ఆయన పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, కొనుగోలు చేసిన ధాన్యం,ట్యాబ్ ఎంట్రీ ,చెల్లింపుల వివరాలను, అదేవిధంగా ధాన్యం తేమ, లారీలు, హమాలీ తదితర వివరాలన్నింటినీ కేంద్ర నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. 17 శాతం తేమతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.కాగా తాటికల్ కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు 149 మంది రైతులు ధాన్యం తీసుకురాగా, 105 మంది రైతుల ధాన్యాన్ని తూకం చేయగా,33 మంది రైతుల ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశామని, ఇక్కడ 17 లారీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఇనుపాముల ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు 135 మంది రైతులు ధాన్యం తీసుకురాగా , 56 మంది రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు, 25 మంది రైతుల ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసినట్లు తెలిపారు. ధాన్యం అమ్మిన 8 మంది రైతులకు డబ్బులను చెల్లింపులు చేయడం జరిగిందని,ఈ కేంద్రంలో 12 లారీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చీమల గడ్డ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 201 మంది రైతులు ధాన్యం తీసుకురాగా ,126 మంది రైతుల ధాన్యాన్ని తూకం వేయడం జరిగిందని , 73 మంది ధాన్యం అమ్మిన రైతుల వివరాలను టాబ్ లో నమోదు చేశామని, 21 మంది రైతులకు చెల్లింపులు సైతం చేయడం జరిగిందని ,ఈ కేంద్రంలో 28 లారీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు , పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు

# మండల గ్రంథాలయంలో పాఠకులు ఎక్కువగా వచ్చేలా చొరవ చూపాలి

## - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్



ములుగు, నవంబర్ 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క సూచనలతో గురువారం మంగపేట మండల కేంద్రంలోని గ్రంథాలయంను పరిశీలించి అవసరం అయ్యే ఏదైనా కూడా ఆ సమస్య ను తన ద్రుష్టికి తీసుకొని రావాలని అదేవిధంగా రెగ్యులర్ గా వచ్చే పాటకులకు మంచినీటి సౌకర్యం కల్పించి విరామ సమయంలో టీ కూడా ఇవ్వాలి అని అన్నారు. అనంతరం మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ కి వెళ్లి ఇక్కడ వున్నా గ్రంథాలయంలో సుమారుగా 6000 వేల పుస్తకలు అందుబాటులో వున్నాయ్ పోటీ పరీక్షలలో కావొచ్చు, మహామహుల చరిత్ర లు కావొచ్చు, అన్ని రకాల పుస్తకాలు వున్నాయ్ కావున ఈ యొక్క అవకాశం ను వినియోగించుకోవాలి అని అదేవిధంగా కళాశాలలోని సమస్య లపై రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యకి పరిష్కారం అయ్యే విధంగా చూస్తాం అని హామీ నిచ్చిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ బానోత్ రవి చందర్ ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి అదేవిధంగా జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, అన్ని గ్రామాలలోనీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు తదితరులు హాజరయ్యారు.

# అన్ని విజ్ఞప్తులకు ముఖాముఖి పరిష్కారం



హైదరాబాద్: ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించే వేదికంగా ముఖాముఖి కార్యక్రమం నిలుస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్లు, అటవీ భూములు, ఆరోగ్య, భూమి, ఉద్యోగ, ఉపాధి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో మంత్రి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖాముఖి కార్యక్రామనికి ప్రజలు భారీగా తరలివచ్చి విజ్ఞప్తులు చేశారు. వాటిని మంత్రి పరిశీలించి కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరిం చారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తూ సమస్యలను వివరిస్తూ పరిష్కారాలను సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు గత పదేండ్ల కాలంలో మంత్రుల అపాయిట్‌మెంట్ దొరికేది కాదన్నారు. టీపీసీసీ సూచనమేరకు కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు పోతున్నట్టు తెలిపారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు తాను గాంధీభవన్‌కు వచ్చానన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మంచి సంప్రదాయానికి నాంది పలికారని తెలిపారు. బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ కులం అడుగుతున్నారని చెప్పారు. దేశంలో కులగణన చేపట్టి, అందులో భాగంగా రాహుల్ ఇంటికెళ్లి ఆయన కులాన్ని అడగాలని సూచించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా మన దేశంలో కులం ఉందని చెప్పారు. కుల వివక్షను పోగొట్టేందుకే కులగణన సర్వే చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టి తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలువబోతున్నదని చెప్పారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి 30 వినతులు, వివిధ మంత్రులకు సంబంధించి 63, ఇతర దరఖాస్తులు 37 మొత్తంగా 130 ఫిర్యాదు వచ్చినట్టు తెలిపారు.

# ఆర్మూర్ గులాబీలో కలకలం

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేల తీరుపై.. గులాబీ క్యాడర్ గుస్సాగా ఉన్నారట. పార్టీ కష్టకాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం పట్ల కార్యకర్తలు గుర్రుగా ఉన్నారట. పార్టీ సీనియర్ మహిళా శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిస్తే.. జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు జరగలేదంటే అక్కడి పరిస్థితి ఎలా ఉందో తేటతెల్లమవుతోందని జోరుగా చర్చించుకుంటున్నారట.బాల్కొండ, కామారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తే.. బాన్సువాడ, ఆర్మూర్ లో మొక్కుబడిగా కార్యక్రమం జరిగినట్లు చెబుతున్నారు. ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు.. కేటీఆర్ ఆదేశాలను లైట్ తీసుకున్నారట. కార్యక్రమాలు చేసేందుకు క్యాడర్ కు సైతం దిశానిర్దేశం చేయలేదట. దీంతో గులాబీ శ్రేణులు తమ నేతల తీరుపై.. చిటపటలాడుతున్నారట.నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. త్వరలో మేయర్ సైతం పార్టీ మారేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారట. మాజీ ఎమ్మెల్యే బిగాల సైతం వలసలను అడ్డుకోలేకపోతున్నారట. దాంతో అడపాదడపా నియోజకవర్గానికి వస్తూ.. పార్టీ కార్యక్రమాలు మొక్కుబడిగా జరిపిస్తున్నారట. రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం.. నియోజకవర్గానికి ఎక్కువగా రావడం లేదట. నేతలె పక్కదారి చూస్తుండడంతో.. క్యాడర్ సైతం హస్తం గూటికి క్యూ కట్టారట. ఇక బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నారట. ఇప్పటి వరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదట. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో ఇంచార్జి బాధ్యతల నుంచి షకీల్ ను తప్పించాలని క్యాడర్ కోరుతున్నారట.ఆర్మూర్ లో మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షునిగా ఉన్న జీవన్‌రెడ్డి.. హైదరాబాద్ కు పరిమితం అయ్యారట. ఇప్పటికే ఆర్మూర్ లోనూ ద్వితీయ శ్రేణి నేతలు హస్తం గూటికి చేరారట. అలానే ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు చాలా రోజులుగా నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారట. క్యాడర్ కు అందుబాటులో ఉండకుండా.. నియోజకవర్గానికి ముఖం చాటేశారట. జిల్లాల్లోని



నేతలంతా పార్టీకి దూరంగా ఉండడం వెనుక ఏదైనా వ్యూహం ఉందా అనే టాక్ నడుస్తోందట. నేతలంతా పార్టీ మారాలనే ఆలోచనలో ఉన్నారా ? అన్న చర్చజరుగుతోందట. ఇంచార్జీలుగా ఉన్నా లేనట్లు కాకుండా.. పార్టీ పటిష్టత కోసం అందుబాటులో ఉండాలని క్యాడర్ కోరుతున్నారట.ఒక వైపు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయాలు.. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారని విమర్శను మూటగట్టుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ కనిపించక పోవడం ఆ వాదనలను మరింత బలపరుస్తున్నాయి. ఇక వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆరే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ విఫలం అయ్యారని విమర్శలు వస్తున్నాయి. రీసెంట్ గా కేటీఆర్ బావమరిది పాకాల రాజు ఫామ్ హౌస్ పార్టీ ఇష్యూ ఫుల్ హాట్ టాపిక్ అయ్యింది. దీంతో మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లుగా.. మాజీలు సైతం ఒక్కొక్కరుగా సైడ్ అవుతుండడం పార్టీ కార్యకర్తలని కలవరపెడుతుందట. ఇప్పటికే వరుస ఓటములతో సతమవుతున్న గులాబీ పార్టీకి.. ఈ వ్యవహారం మరింత తలనొప్పులు తెస్తుందని అభిప్రాయపడుతున్నారట. మరోవైపు పార్టీ నేతల తీరుపై.. గులాబీ బాస్ అసంతృప్తితో ఉన్నారట. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న తరుణంలో.. పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేయాల్సిన లీడర్లు పట్టించుకోకపోవడం పట్ల గుర్రుగా ఉన్నారట. ఈ పరిస్థితుల్లో మాజీల వ్యవహారంలో కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారు ? అసలు మాజీలు ఏం చేయాలనుకుంటున్నారని చర్చ జరుగుతోంది.

# సర్వే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: సమగ్ర కుటుంబ సర్వేకై ఇండ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇళ్లకు స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను కలెక్టర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ స్థానిక సంస్థలు, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామపంచాయతీలోని ఆరో వార్డులో, చిగురుమామిడి మండలం రేగొండ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మపల్లి గ్రామంలోని 13వ వార్డులో, చిగురుమామిడి మండల కేంద్రంలోని పదోవార్డులో ఇళ్లకు స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికీ సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదని, అందువల్ల ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువలన తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఈనెల 6 నుండి 8 వరకు ఇండ్లను సందర్శించి ఇండ్ల జాబితాను రూపొందించడం జరుగుతుందని, అనంతరం సర్వేకు ప్రభుత్వం రూపొందించిన సుమారు 75 కాలంలలో వివరాల సేకరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్ బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకుని ఎన్యుమరేటర్లకు అందుబాటులో ఉండి సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు, సర్వే ఫారంలో ఎన్యుమరేటర్లు ఎట్టి పరిస్థితులలో తప్పులు నింపవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, లేదా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇండ్ల జాబితా తయారీ సందర్భంగా ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని చెప్పారు. సర్వే ఫారం లో పూర్తి వివరాలను నింపాలని, ప్రతి ఇంటికి వెళ్లి సేకరించిన డేటాను ఆన్లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే విషయంలో అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సర్వేకు అవసరమైన వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని యజమానులకువివరించి చెప్పాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఎంపీడీవో టి. విజయ్ కుమార్, తహసీల్దార్ కె. విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీవాణి, చిగురుమామిడి ఎంపీడీవో మధుసూదన్, ఆర్ఐ సంతోష్, కార్యదర్శులు అజయ్ కుమార్, రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్గొండ: సమగ్ర కుటుంబ సర్వేకై ఇండ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ప్రారంభమైన సామాజిక ,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను నల్గొండ మున్సిపాలిటీ పరిధిలోని బి టి ఎస్ కాలనీలో ఆమె తనిఖీ చేశారు.మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ, ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుం దని, ఎవరికీ సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదని ,అందువల్ల ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ,ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువలన తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు .ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ,ఈనెల 6 నుండి 8 వరకు ఇండ్లను సందర్శించి ఇండ్ల జాబితాను రూపొందించడం జరుగుతుందని, అనంతరం సర్వేకు ప్రభుత్వం రూపొందించిన సుమారు 75 కాలంలలో వివరాల సేకరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్ బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకుని ఎన్యుమరేటర్లకు అందుబాటులో ఉండి సమాచారం ఇచ్చి సహకరించాలని పునరుద్ఘాటించారు. సర్వే ఫారంలో ఎన్యుమరేటర్లు ఎట్టి పరిస్థితులలో తప్పులు నింపవద్దని,ఏవైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, లేదా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.ఇండ్ల జాబితా తయారీ సందర్భంగా ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని చెప్పారు. సర్వే ఫారంలో పూర్తి వివరాలను నింపాలని, ప్రతి ఇంటికి వెళ్లి సేకరించిన డేటాను ఆన్లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సమగ్ర సర్వే విషయంపై విస్తృతంగా టామ్ టామ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర సర్వేకు వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. మూడు స్థాయిల్లో సర్వేను పర్యవేక్షించడం జరుగుతుందని, ఇందుకు సూపర్వైజర్లు, మండల ప్రత్యేక అధికారి లేదా మున్సిపల్ కమిషనర్ , జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, అంతేకాక ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్, ఆకస్మికతనిఖీల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నరు.

# కులగణనపై గులాబీలో మధనం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు కులగణన హాట్ టాపిక్ అయింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రారంభం కాబోతోంది. ప్రభుత్వం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించబోతున్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ సైతం పూర్తిచేశారు. మొత్తం 75 ప్రశ్నలతో ఈ సర్వే కొనసాగుతోంది. దాదాపు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సర్వే కోసం ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో కష్టపడుతోంది. సుమారు 48 వేల మంది ప్రభుత్వ సిబ్బంది ఇందులో భాగస్వాములు అవుతున్నారు. వారిలో 40వేల మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఈ క్రమంలో కులగణనపై స్టడీ కోసం నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం హైదరాబాద్ నగరానికి వచ్చారు.కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ కులగణన చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కులగణన చేపడుతోంది. అయితే.. కులగణనపై బీఆర్ఎస్ స్ట్రాటజీని మాత్రం ఎక్కడా బయటపెట్టడం లేదు. ఒకవిధంగా చెప్పాలంటే ఇప్పుడు కులగణన బీఆర్ఎస్ పార్టీకి కొరకరాని కొయ్యలా తయారైంది. ముందుకు పోతే నుయ్యి.. వెనక్కి పోతే గొయ్యి అన్న చందంగా పరిస్థితి ఉంది. ఇటీవల బీసీ నేత ఆర్ కృష్ణయ్య కులగణనకు బీసీ కమిషన్ ప్రామాణికం కాదని.. ప్రత్యేక కమిషన్ వేయాలంటూ హైకోర్టును ఆదేశించారు. దాంతో హైకోర్టు విచారణ జరిపించి కృష్ణయ్య వాదనను ఏకీభవించింది. ఫలితంగా ప్రభుత్వం కూడా ప్రత్యేక కమిషన్ నియమించింది. అయితే.. మొన్నటివరకు హైకోర్టు వాదననే బీఆర్ఎస్ నేతలు వినిపించారు. ఎట్టకేలకు ప్రభుత్వం కూడా కమిషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో వారి నోళ్లకు మూతలు పడ్డాయి. దాంతో ఇప్పుడు కులగణనపై ఏ ఒక్క గులాబీ నేత కూడా మాట్లాడడం లేదు.కులగణన అంశం కూడా ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఇరుకున పడేసిందనే చెప్పాలి. దాంతో కులగణన అంశాన్ని డైవర్ట్ చేసేందుకు నానా ఫీట్లు చేస్తోంది.




రోజుకో ప్లాన్ చేస్తున్నప్పటికీ పెద్దగా వర్కవుట్ అవ్వడం లేదు. అయితే.. ఏదో ఒక టాపిక్ తీసుకొచ్చి కులగణన టాపిక్‌ను డైవర్ట్ చేసే ప్రయత్నమే చేస్తోంది. ఎందుకంటే.. కులగణనకు మద్దతు తెలిపితే కాంగ్రెస్ పనిని సమర్థించినట్లుగా అవుతుంది. ఒకవేళ వ్యతిరేకిస్తే బీసీల నుంచి వ్యతిరేకత వస్తుంది. దీంతో ఈ రెండు పరిస్థితుల మధ్య బీఆర్ఎస్ పార్టీ ఎటూ తేల్చుకోలేకపోతోంది. అందుకే.. ఈ టాపిక్‌ను పెద్దగా పట్టించుకోకుండా వీలైనంత డైవర్ట్ చేసే ప్రయత్నమే చేస్తున్నట్లు తెలుస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన సకల జనుల సర్వే మాదిరే ఈ కులగణన కూడా. అప్పుడు ఒక్క రోజులే తెలంగాణ మొత్తాన్ని స్తంభింపజేసి బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వే నిర్వహించింది. కుటుంబానికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించారు. అయితే.. ఆ డేటాను దేనికి వినియోగించారు.. ఎక్కడ పోయిందో కూడా ఎవరికీ తెలియదు. అంతేకాదు.. అలాంటి సర్వేనే కేంద్రం సర్వే నిర్వహించాలని కేసీఆర్ ఆ సమయంలో ఉచిత సలహాలు కూడా ఇచ్చారు. ఇప్పుడు రేవంత్ సర్కార్ సైతం అలాంటి సర్వేనే నిర్వహిస్తోంది. అయితే.. దీనిపై బీఆర్ఎస్ ఏం చెప్పబోతోందా అన్న ఆసక్తి రాష్ట్రవ్యాప్తంగానూ కనిపిస్తోంది.

# కన్నవారి పేరున సేవ చేయాలనే ఆలోచన రావాలి

**-తల్లిదండ్రులను ప్రేమించడం అలవాటు చేసుకోవాలి**

**-చిగురు విద్యాసాగర్‌రావు ఆలోచన స్ఫూర్తిదాయకం**

**-మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మంథని: కన్నవారి పేరున పేదవారికి సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో స్వర్గీయ చిగురు మధుసుధన్‌రావు 15వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చిగురు విద్యాసాగర్‌రావు గ్రామస్తుల సౌకర్యార్థం నిర్మించిన వాటర్ ట్యాంక్, పశువుల దాహార్తి తీర్చేలా నిర్మించిన ట్యాంకును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది తమ తల్లిదండ్రుల పేరిట సామాజిక,స్వచ్ఛంద సేవలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. అయితే కొంతమంది తల్లిదండ్రులను పట్టించుకోకుండా వదిలివేస్తున్న సంఘటనలు అక్కడక్కడా జరుగుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులను ప్రేమించడం, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని, తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడంలో ఎంతో సంతృప్తి



ఉంటుందన్నారు. అడవిశ్రీరాంపూర్ వాసులకు తాగునీటి సమస్య తీర్చడంతో పాటు అనేక విధాలుగా ఉపయోగపడే విధంగా తన తండ్రి స్మారకంగా విద్యాసాగర్‌రావు వాటర్ ట్యాంకు నిర్మించడం చాలా గొప్పవిషయమని, ఆయన ఆలోచన స్ఫూర్తిదాయమకమన్నారు. ప్రతి ఒక్కరు కన్నవారి పేరున సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో ఆ నేతల కామెంట్స్‌తో అలజడి

హైదరాబాద్: పార్టీలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు కీలక పదవుల్లో ఉన్నవారు మాట్లాడిన మాటలు తలనొప్పిగా మారాయట. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా కాంగ్రెస్ లీడర్ల రూటే సెపరేటు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంటుంది హస్తం పార్టీ నేతల తీరు. నేతలంతా తామే సుప్రీం అన్నట్లుగా మాట్లాడుతుంటారు. ఇప్పుడు పవర్లో ఉన్నప్పటికీ కూడా కొందరు నేతల తీరులో మార్పు లేదట. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో నేతలు ఎవరికి తోచింది వారు మాట్లాడి పార్టీకి తలనొప్పులు తెచ్చిపెడుతున్నారట.పార్టీలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు, కీలక పదవుల్లో ఉన్నవారు మాట్లాడిన మాటలు తలనొప్పిగా మారాయట. సీనియర్లు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకటికి రెండుసార్లు ఆలోచించి మాట్లాడా లని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సూచించినా కొందరి నేతల తీరులో మార్పు రావడం లేదు. కొందరు లీడర్లు నోరు జారుతుండటంపై పార్టీ పెద్దలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పలుమార్లు చేసిన కామెంట్స్ పార్టీకి నష్టం చేశాయని పలువురు హస్తం నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నేతలకే భద్రత లేకుండా పోయిందంటూ రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు జీవన్ రెడ్డి. గతంలో కేసీఆర్ ఫిరాయింపులు ప్రోత్సహించి తప్పుచేశారని ఇదే తప్పును కాంగ్రెస్ నేతలు ఎందుకు చేస్తున్నారని జీవన్ రెడ్డి ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ని ఆదర్శంగా తీసుకోవాలా? ఫిరాయింపులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలా అంటూ అధిష్ఠానానికి లేఖ రాశారు. జీవన్రెడ్డి ఆవేదనను అర్థం చేసుకుంటామని పైకి నేతలు చెప్తున్నా.. ఇలా ఓపెన్ స్టేట్మెంట్లతో పార్టీని ఇబ్బంది పెట్టడం సరికాదం టున్నారు మెజార్టీ నేతలు. ఇక కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ హైడ్రా, మూసీ విషయంలో చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. మూసీ బాధితులకు అండగా ఉంటానని ప్రకటిం చారు. ప్రభుత్వం మొండిగా, దౌర్జన్యంగా, అన్యాయంగా ముందుకు వెళ్తే ఒక న్యాయ వాదిగా ప్రభుత్వంపై కేసు వేసి ప్రజల తరఫున కొట్లాడుతానని మధుయాష్కీ ప్రకటించారు. ఇక ఆస్తులు సంపాదించుకోవడానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని, పార్టీలోకి వచ్చే ఎమ్మెల్యేలకు పార్టీపై ప్రేమ లేదని ప్రకటించారు మధుయాష్కీ. ఆయన కామెంట్లను కవర్ చేసే ప్రయత్నం చేశారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సహకరించడానికి వచ్చారని వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పుకొచ్చారు. తీన్మార్ మల్లన్న కూడా, అంతకముందు మంత్రి కొండా సురేఖ నాగార్జున ఫ్యామిలీపై చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదానికి కారణమయ్యాయి. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కూడా బీసీ సభలు నిర్వహిస్తూ పార్టీని ఇబ్బంది పెట్టే ప్రకటనలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ నుంచి చివరి రెడ్డి ముఖ్యమంత్రి అని, గ్రూప్-1 విషయంలో ప్రభుత్వం తప్పు చేస్తోందని మాట్లాడారు. నల్గొండ రెడ్డి మంత్రులు తనని ఓడగొట్టడానికి ప్రయత్నం చేశారని, మంత్రి పొంగులేటికి అన్ని ఆస్తులు ఎలా వచ్చాయంటూ బాంబుల మీద బాంబులు వేస్తునారు.సియోల్ నగర అభివృద్ధి పై స్టడీ కోసం పలువురు జర్నలిస్టులను ప్రభుత్వం కొరియాకు పంపించడాన్ని మల్లన్న తప్పుపట్టారు.ఈ విషయాలన్నీ ఈ మధ్యే గాంధీభవన్లో జరిగిన ఓ సమావేశంలో చర్చకు వచ్చాయట. సీఎంను ఉద్దేశించి మల్లన్న చేసిన కామెంట్స్ పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని కొందరు నేతలు ప్రస్తావించినట్లు టాక్. సీఎం జోక్యం చేసుకుని ఎలాంటి అనుమానాలు ఉన్నా ప్రభుత్వం నుంచి క్లారిటీ తీసుకుని మాట్లాడాలని సూచించారట. క్లారిటీ తీసుకోకుండా ఏది పడితే అది మాట్లాడితే పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలుగుతుందని సీఎం చెప్పినట్లు తెలుస్తోంది. పలువురు నేతలు తరచుగా చేస్తున్న వ్యాఖ్యలు పార్టీని ఇబ్బంది పెడుతుండటంతో సీరియస్ గా ఉండాలని పీసీసీ చీఫ్, సీఎం నిర్ణయం తీసుకున్నారట. ఇకపై పార్టీకి ఇబ్బంది కలిగించే కామెంట్స్ చేస్తే ఊరుకునేది లేదని, నేతలు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని తేల్చి చెప్పారట. సీఎం, పీసీసీ చీఫ్ వార్నింగ్ తో అయినా పార్టీ నేతల్లో మార్పు వస్తుందో లేదో చూడాలి.

# తెలంగాణ డబ్బులతో మహారాష్ట్ర, జార్ఖండ్ లో యాడ్స్

హైదరాబాద్: తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్రలో యాడ్స్.. ఏంటి రేవంతన్నా ఇదీ! తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని అమలవుతున్నాయి తెలంగాణాలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇందుకు కారణం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక కారణమైతే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోవడం.. కేసీఆర్ అహంకార పూరిత పాలనపై ఆగ్రహంగా ఉండడం కూడా కాంగ్రెస్ గెలుపునకు దోహందం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఎన్నికల హామీలు నెరవేర్చడంపై రేవంత్ సర్కార్ దృష్టిపెట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇటీవలే రైతుల పంట రుణాలు మాఫీ చేశారు. అయితే పూర్తిస్థాయిలో జరగలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇక ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, రేషన్ కార్డుపై సన్నబియ్యం, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వలేదు. ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం చెల్లించలేదు. వీటిపై విపక్ష బీఆర్ఎస్, బీజేపీ ఆందోళనలు చేస్తున్నాయి. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు సన్న వడ్లకు ఇస్తామని మాట మార్చారు. ఇలాంటి పరిస్థితిలో మన పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. నవంబర్ 13న ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు మహారాష్ట్రతోపాటు జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.ఇదిలా ఉంటే.. తెలంగాణ నేతలు ప్రచారానికి పరిమితం కాకుండా.. తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్ర పత్రికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు, గొప్పలు, తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి ప్రకటనలు ఇస్తున్నారు. మరాఠా ఓటర్లను ఆకట్టుకునే ప్రనయత్నం చేస్తున్నారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మహారాష్ట్రలో ఏం చేస్తారో చెప్పకుండా.. తెలంగాణలో అది చేశాం.. ఇది చేశాం అని గొప్పలు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు తెలంగాణ ప్రజల సొమ్ము వినియోగించడంపై మండిపడుతున్నారు.తెలంగాణ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇంకా అమలు కాలేదు. అనేక హామీలు హామీలుగానే ఉన్నాయి. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ మహారాష్ట్రలో తెలంగాణలో అన్నీ చేశామని ప్రచారం చేసుకోవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. తప్పుడు ప్రచారంతో మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను మించిపోయిందని పేర్కొన్నారు. మాజీ సర్పంచుల కోసం బీఆర్ఎస్ ఆందోళన చేయడంపై మండిపడ్డారు. గతంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. చంపినోడే సంతాప సభ పెట్టిన్లు బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారుఇక రేవంత్‌సర్కార్ తలపెట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఓ కాంగ్రెస్ నేత అల్లు కోసమే అని బండి సంజయ్ ఆరోపించారు. రూ.15 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన దానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామని అంటున్నారని తెలిపారు. శంషాబాద్ ఆంజనేయస్వామి ఆలయంపై దాడిని కండించారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులంతా రెడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

# కేంద్రంలో 9. 7 లక్షల ఖాళీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. ఇందుక్కారణం పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండడమే. ప్రతి 4 పోస్టులకు 1 ఖాళీగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వేతనాలు, భత్యాలు అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 2023 మార్చి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 24% పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే మంజూరైన పోస్టుల సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతుందని నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంలో మొత్తం 40 లక్షల సాధారణ ఉద్యోగాలు ఉన్నాయి. అంటే ఇవి కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ పరిధిలో ఉన్న సాయుధ బలగాల పోస్టులతో సంబంధం లేనివి. వీటిలో 9.7 లక్షల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. అంటే మొత్తం పోస్టులు 40 లక్షలతో పోల్చితే దాదాపుగా నాలుగో వంతు. ఈ ఖాళీల్లో అత్యధికంగా గ్రూప్–అ (నాన్ గెజిటెడ్) కేటగిరీలో 33 శాతానికి పైగా ఖాళీలు ఉండగా, గ్రూప్–ః (గెజిటెడ్)లో 16% వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడడానికి కారణాలను నివేదికలో ప్రస్తావించినప్పటికీ.. నియామక ప్రక్రియలో జాప్యమే ఖాళీల సంఖ్య పెరగడానికి ముఖ్య కారణమని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. పదవీ విరమణల కారణంగా ఏర్పడుతున్న ఖాళీలను ఆ మేరకు భర్తీ చేయకుండా, ఆ పని చేసేందుకు వివిధ ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ ఇవ్వడం కూడా ఒక కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్ పద్ధతిలో కొందరిని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కొందరిని తీసుకుంటున్నాయి. ఈ విధానం ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని చాలా వరకు తగ్గిస్తున్నాయి. మరోవైపు రోజువారీ ప్రభుత్వ కార్యాకలాపాలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. 'పీఎం రోజ్‌గార్ మేళా' పేరుతో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తోంది. అలా నియమించినవారికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను అందించారు. ఇలా ఇప్పటి వరకు 13 రోజ్‌గార్ మేళాలను నిర్వహించగా.. చివరి మేళాలో 51,000 మందికి నియామక పత్రాలను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. కేంద్ర ప్రభుత్వంలో సాయుధ బలగాలను మినహాయించి సాధారణ ప్రభుత్వ ఉద్యోగాల్లో అత్యధిక సంఖ్యలో సిబ్బందిని కలిగిన శాఖలు 5 ఉన్నాయి. వాటిలో మొదటి స్థానం రైల్వేదే. ఆ తర్వాత రక్షణ శాఖ (సివిల్), హోంశాఖ, పోస్టల్, రెవెన్యూ విభాగాలున్నాయి. ఈ 5 విభాగాలు కలిపి మొత్తం సిబ్బంది సంఖ్యా బలంలో 92% ఉన్నాయంటే ఇవి ఎంత పెద్ద విభాగాలో అర్థం చేసుకోవచ్చు. ప్రతి 10 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో దాదాపు 4 ఉద్యోగాలు రైల్వే రైల్వే ఒక్కటే అందిస్తుంది. గణాంకాల ప్రకారం రైల్వే శాఖలో మొత్తం 14.89 లక్షలకు పైగా పోస్టులు ఉండగా.. ప్రస్తుతం ఉన్న సిబ్బంది 11.73 లక్షలు మాత్రమే. అంటే ఒక్క రైల్వే శాఖలోనే 3 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. హోం మంత్రిత్వ శాఖలో 11.12 లక్షల పోస్టులు ఉండగా.. ప్రస్తుత సంఖ్య 9.84 లక్షల వరకు ఉంది. ఈ లెక్కన ఈ శాఖలో దాదాపు 1.28 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రక్షణశాఖలో ఉన్న సివిలియన్ పోస్టులు 5.77 లక్షలు ఉండగా..వీటిలో 2.44 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే మాదిరిగా పోస్టల్, రెవెన్యూ విభాగాల్లోనూ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో జీతం మరియు భత్యం (బోనస్, తాత్కాలిక బోనస్, గౌరవ వేతనం, సంపాదించిన సెలవులు మరియు ట్రావెలింగ్ అలవెన్స్‌లు మినహా) మొత్తం వ్యయం 7 శాతానికి పైగా పెరిగిందని నివేదిక పేర్కొంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.56 లక్షల కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడగా.. ఇప్పుడు అది రూ. 2.75 లక్షల కోట్లకు చేరుకుంది. వీటిలో 80% మేర నాలుగు మంత్రిత్వ శాఖలు రైల్వేలు, రక్షణ , హోం వ్యవహారాలు మరియు పోస్టల్ విభాగాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే.. విద్యావ్యవస్థలో ఖాళీలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖలో.. ముఖ్యంగా దేశంలోని 46 సెంట్రల్ యూనివర్సిటీల్లో 27 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. వీటిలో అత్యధికంగాఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి రిజర్వుడు వర్గాల పోస్టులే ఖాళీగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బదులిస్తూ..2014 నాటికి సెంట్రల్ యూని వర్సిటీల్లో మొత్తం 37శాతం పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అది ఇప్పుడు 26.8% కు చేరుకుందని తెలిపారు. అంటే యూపీఏ హయాం లోనే ఎక్కువ ఖాళీలు ఉండగా.. తాము వాటిని భర్తీ చేస్తూ ఖాళీల సంఖ్యను గణనీయంగా తగ్గించామని వివరించారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# ఆలయాలపై దాడులను చేస్తే తాట తీస్తాం....

### – తెలంగాణ దర్మప్రసార్ సహ ప్రముఖ్ మదురనేని సుభాష్ చందర్

హైదరాబాద్: తెలంగాణలో హిందూ ఆలయాలపై రోజు రోజుకు దాడులు పెరిగి పెరిగిపోయాయని వాటిని అదుపు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్య చెందిందని తెలంగాణ రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ దర్మప్రసార్ సహ ప్రముఖ్ మధురనేని సుభాష్ చందర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి హిందూ వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తుందని అన్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ, సదాశివపేట్ లో వినాయకుని, షంషాబాద్ లో నవగ్రహ విగ్రహాలు ద్వంసం చేయబడ్డాయి. ఇంతకు నిందితులను ఈ ప్రభుత్వం అరెస్ట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఓ వర్గం మెప్పు పొందడానికి గత ప్రభుత్వానికి హిందూ సమాజం దెబ్బ కొట్టిందన్నారు. ఈ ప్రభుత్వం ఇలాగే అనుసరిస్తే అదే జరుగుతుందని అన్నారు. ఆలయాలపై దాడులు చేసిన దుండగులు సీసీ కెమేరాలో పట్టుబడితే వారికి మతిస్థిమితం లేదని ఈ ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాలకు చెందిన ప్రార్థన మందిరాపై ఆ పిచ్చివారు ఎందుకు దాడులు చేయడం లేదని అన్నారు. కేవలం హిందు ఆలయాలపై మాత్రమే ఎందుకు ఆ మతిస్థిమితం లేని వారు దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు.

# పదెకరాలకే రైతు భరోసా..!

హైదరాబాద్: మార్గదర్శకాలు సిద్ధం అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్న సర్కార్ నెలాఖరులోపు పెట్టుబడి సాయం షురూ. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాపై దృష్టి సారించింది. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు తీపి కబురు చెప్పింది.రైతు భరోసాకు పదెకరాల వరకు కటాఫ్ విధించాలని నిర్ణయించింది. ఈమేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘం నివేదికను సమర్పించి నట్టు తెలిసింది.నివేదికలోని కీలకమైన మార్గదర్శకాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు ఐదేండ్లలో రైతు బంధు పేరిట దాదాపు రూ.20వేల కోట్లను వ్యవసాయేతర భూములకు ఇచ్చి ప్రజా సొమ్మును వృధా చేసిందని పెట్టుబడి సాయంలో 96శాతం రైతులకు మేలు చేసేందుకు సర్కారు సిద్ధమవుతున్నదని సీఎం రేవంత్రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు గత సర్కార్ హయాంలో రాళ్లు, రప్పల భూములు, గుట్టలు, హైవేలు, రోడ్లు, వెంచర్లు, భూసేకరణ కింద పోయిన భూములకు వేల కోట్ల రూపాయలు రైతుభరోసా కింద వథాగా చెల్లించినట్లు తేల్చింది.

**వానాకాలం నుంచా? యాసంగి నుంచా?**

రైతులకు పంట పెట్టుబడి సాయం ఈ నెలాఖరు నుంచి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. కానీ దాన్ని వానాకాలం నుంచి లెక్కగట్టి ఇస్తారా? లేక ఈ యాసంగి నుంచి రైతు భరోసా జమ చేస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు. అయితే రైతు భరోసాకు నిధులను సర్దుబాటు చేయాలంటూ ఆర్థిక శాఖను సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికే ఆదేశించినట్టు సమాచారం.ఎప్పటి మాదిరిగానే ఒక ఎకరా నుంచి మొదలుపెట్టాలనీ, డిసెంబర్ నెలాఖరు వరకైనా సరే రైతుల ఖాతాలకు నిధుల జమ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. వాస్తవానికి దసరా తర్వాత నుంచే రైతు భరోసా పంపిణీ చేయాలని తొలుత ప్రభుత్వం భావించింది. కానీ, అప్పటికే రుణమాఫీ కోసం రూ.18 వేల కోట్లు రైతులకు విడుదల చేసింది. దీంతోపాటు మరికొన్ని స్కీములకు నిధులు సర్దుబాటు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో రైతు భరోసా వాయిదా పడుతూ వస్తున్నది. అయితే డిసెంబర్ నెలలో జరగనున్న స్థానిక ఎన్నికల కంటే ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయనున్నట్టు సమాచారం. ప్రతి 10 రోజులకు రూ.1,500 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల చొప్పున జమ చేసేలా 45 రోజుల్లో కనీసం రూ.7 వేల కోట్లు జమ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సాగు లెక్కల ప్రకారం 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ నేపథ్యంలో రైతు భరోసాలో దుబారాను కట్టడి చేసినా పెట్టుబడి సాయం కోసం దాదాపు రూ. 7వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు.

**విస్తృత అభిప్రాయ సేకరణ పూర్తి**

ఇప్పుడున్న లెక్కల ప్రకారం ఏడెనిమిది ఎకరాల రైతులకు అంటే దాదాపు 96 శాతం మందికి రైతుభరోసా అందుతుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలనే దానిపై జిల్లాల్లో సభలు నిర్వహించి అభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. చాలా మంది రైతులు 10 ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. మరికొంతమంది రైతులు ఏడున్నర ఎకరాల వరకు ఇవ్వాలని సూచించారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే కటాఫ్ ఎంతవరకు పెట్టాలనే దానిపై మార్గదర్శకాలకు సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసినట్టు సమాచారం. రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీల అభిప్రాయాలు ఇప్పటికే తెలుసుకున్నందున, అవసరమైతేనే అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అసెంబ్లీ సమావేశాలను కూడా ఈ నెల మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నప్పటికీ శాసనమండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్ విదేశీ పర్యటనలో ఉండటంతో వారు తిరిగిరాగానే ఆ సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో రైతు భరోసా మార్గదర్శకాలపై చర్చించే అవకాశం ఉంది. మొత్తానికి వ్యవసాయేతర భూములకు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుభరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించినట్టు వినికిడి. వ్యవసాయ భూముల్లో వెంచర్లు చేసి ప్లాట్లుగా మార్చిన వాటికి నాలా కిందనే పరిగణించనున్నారు. రోడ్లు, ఇరిగేషన్, ఇండ్లు ఇతరత్రా వ్యవసాయేతర భూములకు మళ్లిన వాటిని రైతు భరోసా జాబితా నుంచి తీసేయాలని నిర్ణయించారు.

# ఆచులాపూర్ లో ఆర్థిక అక్షరాస్యత సదస్సు

### రుణాలు ఇన్సూరెన్స్ స్కీములపై అవగాహన

### కళాకారుల ఆట, పాటలతో ప్రజలకు అవగాహన

### పెద్ద ఎత్తున హాజరైన గ్రామీణ రైతాంగం

### బ్యాంకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసిన ప్రజానికం

తాండూర్: మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని బుధవారం గ్రామంలో నా బార్డ్ వారి సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత సదస్సు విజయవంతమైంది. ఈ మేరకు ఆచులాపూర్ లో నిర్వహించిన సదస్సుకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు, ప్రజలు హాజరై సక్సెస్ చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అందుతున్న రుణాలు, ఇన్సూరెన్స్, తదితర స్కీములను ప్రజలు వినియోగించుకోవాలని సదస్సు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన కళాకారులు వారి యొక్క ఆట,పాట, మాటల ద్వారా ప్రజలకు పలు స్కీములపై అవగాహన ను కల్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మండలంలోని బ్యాంకు లబ్దిదారులు, ఇతర ప్రజానికం పెద్ద ఎత్తున హాజరయ్యారు. సదస్సు నిర్వాహకులు వివరిస్తున్న పలు స్కీముల వివరాలను హాజరైన ప్రజానీకం ఆసక్తిగా వినడం కనిపించింది. పలువురు లబ్ధిదారులు వారికి ఉన్న అనుమానాలను సదస్సు నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మంచిర్యాల హాస్టల్ విద్యార్థులకు పాయిజన్

అదిలాబాద్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఫుడ్ పాయిజన్ అవడంతో 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన సిబ్బంది హుటాహుటిన విద్యార్థులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆశ్రమ పాఠశాల సిబ్బంది అధికారులకు సమాచారం అందించడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వారు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కంగారుపడుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాలో ఓ స్కూల్ విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంచిర్యాల ఆసుపత్రిలోనే వారు చికిత్స పొందుతున్నారు. అందులో ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నిన్న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లోని భోజనం తిని పలువురు విద్యార్థులు పాఠశాల సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒకరు మృతి చెందారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని విద్యార్థి మృతి సంచలనంగా మారింది. అంతలోనే మంచిర్యాల జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలోనూ ఫుడ్ పాయిజన్ జరగడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు హాస్టల్ సిబ్బంది నాణ్యమైన భోజనం పై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా జాగ్రత్త వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. బయటి మార్కెట్లో హోటళ్లలో కల్తీ నూనె కల్తీ వస్తువుల వాడకం జరుగుతోందని దీంతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బంది రోజు హోటళ్లను పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాలలో కల్తివిక్రయాలు జరుగుతున్నాయని వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ 1984 సవరణ – జ్యుడీషియల్ ఆఫీసర్ల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 61 ఏళ్లకు పెంచేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ సవరణ 2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ డిస్బర్సల్ – 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌ను విద్యార్థుల కళాశాల బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా జమ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీని ద్వారా విద్యార్థులకు త్వరగా సర్టిఫికెట్లు జారీకి మార్గం సుగమం అవుతుంది.


# ఇక సినిమా చూపించబోతున్న హైడ్రా

హైదరాబాద్: అక్రమణలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా.. కాస్త విరామం ఇచ్చింది. అతి త్వరలో అంతకుమించి అనేలా యాక్షన్ షురూ చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా మియాపూర్ స్టాలిన్‌నగర్‌లోని సర్వే నంబర్ 100, 101లపై దృష్టి సారించింది. ఈ సర్వే నంబర్లలో దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వంద ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడా భూములపైనే ఆరాతీస్తోంది హైడ్రా. ఉమ్మడి రాష్ట్రంలో మియాపూర్ భూముల్ని వేలం వేసేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. అయితే సుప్రీంకోర్టులో కేసులు ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. ఈ క్రమంలో అధికారులు చర్యలు తీసుకుంటే బాగానే ఉండేది. కానీ అంతులేని నిర్లక్ష్యం వహించడంతో కబ్జాకోరులు పేట్రేగిపోయారు. పక్కా సర్వే నంబర్లు, బై నంబర్లతో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక మియాపూర్ భూములు తమకు ఇవ్వాలంటూ వేలాది మంది మహిళలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం అప్పట్లో హెచ్ఎండీఏను ఉలిక్కిపడేలా చేసింది. మొదట్లో గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నించారు వాళ్లంతా. ఆ తర్వాత గుడి నిర్మాణానికి సిద్ధమయ్యారు. వారిని సముదాయించేందుకు పోలీసులు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. 144 సెక్షన్ విధించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో చివరకు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది పేదల దండయాత్రతో హెచ్ఎండీఏ అధికారుల్లో కదలిక వచ్చింది. ముందుగా భూముల లెక్క తీశారు. రికార్డుల్లో 105 ఎకరాలు మాయమై.. 445 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఉన్న భూమిలో రెండు కోట్ల 65లక్షల రూపాయలతో ఫెన్సింగ్ వేయాలని టెండర్లు పిలిచారు. కానీ ఆ పనులు కూడా పట్టాలెక్కలేదు. చూస్తుండగానే వందెకరాలకు పైగా సర్కారు భూమి.. అక్రమార్కుల పాలయింది. ఎకరాకి కనీసం 30కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో 3వేల కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. లేటెస్ట్‌గా ఈ కబ్జాకాండపై గురిపెట్టింది హైడ్రా. ప్రభుత్వ భూమి ఎంత.. కబ్జాకి గురైందన్న వివరాలు సేకరిస్తోంది.సర్వే నంబర్ 100, 101లో ఉన్న భూమి ఎంత? ఎన్ని ఎకరాల్లో నిర్మాణాలు వెలిశాయి? నిర్మాణాలు చేపట్టిన వాళ్లకు రిజిస్ట్రేషన్ చేసిందెవరు? ఏయే స్థాయి అధికారులు సహకరించారన్న కోణంలో హైడ్రా ఆరాతీస్తోంది. కూల్చివేతల మొదలయ్యాక ఎవరైనా కోర్టుకెళ్లినా.. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది హైడ్రా. ఈ సారి కూల్చివేతలు మొదలెడితే.. ఎవరొడ్డొచ్చినా ఆగేదేలే అన్నట్టుగా ముందుకెళ్లాలని భావిస్తోంది హైడ్రా..

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యకు పరిష్కారం చూపాలి

### రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్.

కమాన్ పూర్: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ (ఐజి) ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ చేరుకున్న సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. రిసెప్షన్ సందర్శించి రికార్డు లు చెక్ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పిర్యాదు ల విషయం లో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులు కు న్యాయం జరిగే విధంగా చూడాలి అన్నారు. సిబ్బంది తో మాట్లాడివారు చేసే విధులు మరియు ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడగడం జరిగింది. పోలీస్ స్టేషన్ రికార్డ్స్, పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, వారు చేస్తున్న విధులు, పని తీరు, వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, ఇక్కడ ఉండే ప్రజల గురించి, కాలనీ, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయని ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు. బ్లూ క్లోట్స్ సిబ్బంది తో మాట్లాడి డయల్ 100 కాల్స్ కి స్పందించి, వారు సంఘటన స్థలం కి చేరుకొన్న టైం వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. నైట్ టైం లో ఫింగర్ ప్రింట్ డివైస్ తో అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తప్పనిసరిగా సేకరించాలని మరియు బ్లూ క్లోట్స్ సిబ్బంది విధులు అడిగి తెలుసుకోవడం జరిగింది. పెట్రో కార్ వాహనంలలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, రోప్స్, కోన్స్, క్రైమ్ ప్రొటాక్ట్ రిబ్బన్, రైట్ గేర్ కిట్( హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్) లు తప్పనిసరిగా ఉండాలని సూచించడం జరిగింది. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది రాత్రి సమయంలో రౌడీ షీటర్స్ కేడి లు, డిసి లు, సస్పెక్ట్ షీట్స్ ల ఇళ్లను, ఇంపార్టెంట్ పాయింట్ బుక్స్ లను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. స్కూల్స్, కాలేజీ, ప్రధాన కూడాళ్ళ వద్ద విశబుల్ పోలీసింగ్ ఉండాలి, ఆకస్మిక వాహన తనిఖీ లు నిర్వహించాలి.



గంజాయి మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, గోదావరిఖని 2 టౌన్ ఇన్స్పెక్టర్ నక్క ప్రసాద్ రావు, ఎస్ఐ కొట్టే ప్రసాద్ ఉన్నారు.

# ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం

హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అమలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు అమలు చేయబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో ఎత్తు. ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అందుకే నిబంధనల్లో కాస్త సడలింపులు ఇస్తోంది. రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమవుతున్న మంత్రి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మాట్లాడిన గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గుడ్ న్యూస్ చెప్పారు. రేషన్ కార్డు లేకపోయిన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే మొదటి విడతకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపారు మంత్రి. ప్రస్తుతం జరుగుతున్న కుటుంబ సర్వే పూర్తి అయిన తర్వాత అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి అందరికీ రేషన్ కార్డులు లేనందున ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దీన్ని చేర్చడం లేదన్నారు. తర్వాత విడుత నుంచి మాత్రం రేషన్ కార్డు కంపల్సరీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఎప్పుడే ప్రారంభించిన ప్రభుత్వం తొలి విడతలో ఇంటి స్థలం ఉండి గృహాలు లేని వారిపై ఫోకస్ పెట్టింది. వీళ్లకు ఇళ్లు కట్టించే ఇచ్చే బాధ్యత భుజాన వేసుకుంది.రెండో విడతలో స్థలం కూడా లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తారు. నవంబర్ ఆరు నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుంది. దీని కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఒకసారి సమాచారం సేకరించిన తర్వాత దాని ఆధారంగా గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులను నిర్ణయిస్తారు. నవంబర్ 15వ తేదీ నుంచి 20 మధ్య ఈ గ్రామసభలు జరగనున్నాయి. గ్రామస్థులు సమక్షంలో అర్హులు ఖరారైన తర్వాత వారికి స్థలం కేటాయిస్తారు. కేంద్రం చెప్పిన నిబంధనల ప్రకారం 80 గంజాల వరకు స్థలం ఇస్తారు. ఆయా గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉంటే సరేసరి లేకుంటే కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పర్యవేక్షణకు అధికారులను ప్రభుత్వం నియమించనుంది. ఈ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక, రాయితీపై మిగతా నిర్మాణ సామగ్రి సప్లై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నియోజకవర్గానికి తొలి దశలో 3,500 ఇళ్లు కేటాయించి అవి నిర్మాణాల పూర్తి అయిన తర్వాత రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇలా ఐదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# 26న దేశవ్యాప్త నిరసనలు

**- కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు**

హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్టు కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పశ్యపద్మ అధ్యక్షతన ఆ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. అందులో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, వేములపల్లి వెంకట్రామయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు కుమార్, టీయూసీఐ ప్రధాన కార్యదర్శి సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రైతు స్వరాజ్య వేదిక విస్సా కిరణ్ కుమార్, బీకేఎంయూ నాయకులు కె.కాంతయ్య, హెచ్ఎంఎస్ నాయకులు యం.డి.అంజద్ మాట్లాడారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాల్లో 29 చట్టాలను సమూలంగా సవరించి నాలుగు కోడ్‌లు తెచ్చి, కార్మికుల హక్కులను కాలరాయటం దుర్మార్గమన్నారు. ఇప్పటికే 27 సార్లు దేశ వ్యాప్త సమ్మెలు జరిగినా, 30 కోట్ల మంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నా కేంద్ర ప్రభుత్వం దున్నపోతుపై వర్షం పడ్డట్టుగా వ్యవహరిస్తున్నదని వారు విమర్శించారు. రైతులకు పంట గిట్టుబాటు ధర పొందే హక్కు లేకుండా చేసిందని తెలిపారు. మరోవైపు కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించడంలో భాగంగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో ఏడాదిన్నరపాటు అన్నదాతలు ఆందోళనలు చేసినా మోడీ సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు.



దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 18న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో జూమ్ యాప్ ద్వారా లక్షలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొంటారని చెప్పారు. 15న జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాలలో 20 నుంచి 25వ తేదీ వరకు ఆటో, మోటార్ సైకిళ్ల ర్యాలీల ద్వారా ప్రచారం చేస్తామని తెలిపారు. నవంబర్ 26న ఇందిరాపార్కు వద్ద బహిరంగ సభను, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో పి.ప్రేంపావని, ఓరుగంటి యాదయ్య (ఏఐటీయూసీ), ఎస్.ఎల్.పద్మ (టీయూసీఐ), పెద్దారపు రమేష్ (ఏఐకేఎఫ్), జక్కుల నర్సింహ్మా (ఎఐకెకెఎస్), జి.గోపాల్ (తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), కె.ఈశ్వర్ రావు, వంగూరు రాములు (సీఐటీయూ), బి.సత్యనారాయణ (ఐఎఫ్‌టీయూ), భూమన్న (ఐఎఫ్‌టీయూ), ఆకుల పాపయ్య, వి.కోటేశ్వర రావు, ఎం.వెంకన్న (ఏఐకేఎంఎస్), వి.ప్రభాకర్ (ఏఐపీకేఎస్), టి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

**- 56 అంశాలు..75 ప్రశ్నలు**

**- సర్వేలో ఎన్నో వివరాలు..**

పెద్దపల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ప్రారంభమయిన సర్వేలో ప్రతి కుటుంబం వివరాలను సేకరించనున్నారు. సర్వే కోసం 1,979 మంది ఎన్యుమరేటర్లు, 180 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 నుంచి 175 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. సూపర్‌వైజర్లు సైతం దాదాపు 10 శాతం కుటుంబాలను ర్యాండమ్‌గా తనఖీ చేసి.. సర్వే సవ్యంగా జరిగిందీ లేనిదీ పరిశీలిస్తారు. తమ పరిధిలోని ఎన్యుమరేట ర్లకు అవసరమైన సూచనలి వ్వడంతో పాటు ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తారు.

**56 అంశాలు..75 ప్రశ్నలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో 56 అంశాలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలతో సమాచారం సేకరించనున్నారు. సర్వే నిమిత్తం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించడంతో విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే తరగతులు కొనసాగనున్నాయి. మధ్యాహ్నభోజనం అనంతరం టీచర్లు సర్వేలో పాల్గొంటారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా నడుస్తాయి. జిల్లాలో 580 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. 1,117 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులతో పాటు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు, సమగ్రశిక్ష సిబ్బంది, ఇతర ఉద్యోగులు 355 మంది పనిచేస్తున్నారు. వీరిని గణకులుగా నియమించి సర్వేలో పాల్గొనాలని డీఈఓ పేర్కొన్నారు.

**గతంలో మాదిరిగా..**

సర్వేలో భాగంగా జిల్లావ్యాప్తం గా దాదాపు 10 లక్షల మందికి పైగా ప్రజల వివరాలను సేకరించనున్నారు. 2014లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 2,20,673 నివాసాలు, 9,21,623 జనాభా ఉన్నట్లు లెక్క తేలింది. ప్రస్తుతం దాదాపు 2.5 లక్షల నివాసాలకు చేరి ఉంటాయని అంచనా. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. అవసరం మేరకు అదనపు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల సేవలను వినియోగించుకుంటారు.

**రంగంలోకి 1,979 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో ఎన్నో వివరాలు..**

సర్వేలో భాగంగా కుటుంబ యజమానితో పటు సభ్యులందరి వివరాలు.. యజమానితో వారికున్న సంబంధం.. సభ్యులందరి విద్యార్హతలు, ఉద్యోగం లేదా ఉపాధి వివరాలు, మాతృభాష, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఏమైనా సంక్షేమ ఫలాల పొందారా.. అద్దె ఇల్లా..సొంతిల్లా.. ఉంటున్న ఇంటికి ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతున్నారా? వంటి వివరాలు సైతం సేకరించనున్నారు. ఇక స్థిరాస్థిలో భాగంగా భూములు, ఇల్లు వంటి వివరాలతో పాటు చరాస్థి వివరాల్లో భాగంగా ద్విచక్ర వాహనాలతో పాటు కంప్యూటర్లు వాడుతుంటే ఆ వివరాలను సైతం సేకరిస్తారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**- ఎమ్మెల్యేలకు ఎదురు తిరిగిన ద్వితీయ శ్రేణి నాయకులు**

నల్గొండ: సమగ్ర కుటుంబ సర్వేపై పార్టీ కార్యకర్తల్లో అవగాహన కల్పించి గ్రామాల్లో ప్రజలకు వివరించేందుకు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల వారీగా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలను నిర్వహించింది. ఈ సమావేశాలకు ఆయా జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. మూడు రోజుల కిందట నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నల్గొండ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్ హాజరయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ ఎమ్మెల్యే), మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ సమావేశానికి గైర్హాజర్ అయ్యారు. సమగ్ర కుటుంబ సర్వే, కుల గణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలన్న అంశాలపై ముఖ్య కార్యకర్తల కోసం నిర్వహించిన సమావేశంలో కేడర్ అంతా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై, హామీల విస్మరణపై భగ్గు మంది. ఎమ్మెల్యేలను నిలదీస్తూ ముఖ్య కార్యకర్తలు మాట్లాడిన వీడియో ఒకటి మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ ఈ వీడియోను వైరల్ చేస్తోంది. పార్టీ పరిస్థితిపై మాట్లాడేందుకు అవకాశం వచ్చిన జిల్లా కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ప్రభుత్వ పాలనపై విరుచుకు పడింది. నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధాన అనుచర నాయకుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుమ్మల మోహన్ రెడ్డి ముందుగా ఈ అంశాలను లేవనెత్తారు. ఆయనను మరికొందరు నాయకులు కూడా అనుసరించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పది నెలల పాలనా కాలం ముగిసినా అమలు చేయకపోవడాన్ని నిరసించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదు..? గ్యాస్ డబ్బులు ఎందుకు రావడం లేదు..? ఉచిత కరెంటు ఇంకా అందరికి అందడం లేదు. ఆరు గ్యారంటీలేమయ్యాయి..? అంటూ వారు ఎమ్మెల్యేలను నిలదీశారు. " కేడర్ అంతా ఊరూరూ.. పల్లె పల్లెకు తిరిగి పనిచేస్తేనే మీరు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కానీ, పార్టీ ఇచ్చిన హామీలు ఏవీ అమలు కావడం లేదు. ఊళ్లలో ప్రజల ముందు తలెత్తుకోలేక పోతున్నాం.." అంటూ ముఖ్య కేడర్ అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి ధాన్యం దిగుబడులు వచ్చాయి. కొనుగోలు కేంద్రాల్లో ఇరవై రోజులుగా రైతులు పడిగాపులు గాస్తున్నారు. ఎందుకు త్వర త్వరగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం లేదంటూ రైతులు వేస్తున్న ప్రశ్నలకు సమాధం చెప్పలేక పోతున్నామని వాపోయారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచే పౌరసరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా లాభం లేకుండా పోయిందని విరుచుకుపడ్డారు. సన్నాలకు ఇస్తామన్న రూ.500 బోనస్ సంగతి కూడా మర్చిపోయారని, నిత్యం భారీగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని కళ్లాల్లో ధాన్యం తడిచిపోయిన రైతులను చూస్తుంటే వారిని ఎలా సమాధాన పరచాలో తెలియడం లేదని .. ఈ అంశాలన్నింటినీ ఎమ్మెల్యేలు మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడం విశేషం. వచ్చే ఏడాది (2025) సాంతం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తొలుత గ్రామ పంచాయతీలు, ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ వెంటనే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రభుత్వంపై గ్రామీణ ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి పెరిగిపోతోందని, ఇప్పటికైనా జాగ్రత్త పడకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో తిరిగి ఓట్లు వేయించాలేమని కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేల ఎదుట కుండబద్దలు కొట్టారు. మొత్తంగా ఈ మీటింగ్ సారాంశంపై భిన్నాభిప్రాయం వ్యక్తం అవుతోంది. పాలన సజావుగా సాగడం లేదన్న ఆవేదన కార్యకర్తల్లో గూడు కట్టుకుని ఉందన్న విషయం స్పష్టమైందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఒకే వేదిక మీద ఉన్న నలుగురు ఎమ్మెల్యేలు కేడర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళతారా..? కార్యకర్తల్లో పెరిగిపోతున్న ఈ అసంతృప్తికి బ్రేక్ వేసి కొత్త ఉత్సాహంతో ప్రజల్లోకి పంపుతారా లేదా వేచి చూడాల్సి ఉంది. అదే మాదిరిగా, ప్రభుత్వ పాలన తీరుపై ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తిని ఎలా కంట్రోల్ చేస్తారు..? 6 గ్యారంటీ హామీలను పూర్తి స్థాయిలో ఎపుడు అమలు చేస్తారు అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది.

# సర్వే కు ప్రజలు సహారరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 07: సర్వే సిబ్బందికి సహకరించాలని, తప్పుడు సమాచారం ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గణపురం మండలం 3వ వార్డు, భూపాలపల్లి మండలం కృష్ణ కాలనిలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా హౌస్ లిస్టింగ్ సర్వే ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబాన్ని వదల కుండా వివరాలు సేకరణ చేయాలని సూచించారు. కుటుంబ వివరాలు చెబితే ఏదో జరుగుతుం దనే అపోహ వద్దని వివరాలు గోప్యతగా ఉంచుతామని అన్నారు. బుధ గురువారాల్లో రెండు రోజుల పాటు గ్రామ పంచాయతి, మున్సిపాలిటీలో సమగ్ర ఇంటింటి కుటుంబ జాభితా సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఒక్క ఇంటిని కూడా వదల కుండా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులను నియమించామని స్పష్టం చేశారు. 6వ తేది 7 వరకు హౌస్ లిస్టింగ్ సర్వే చేస్తామని, తదుపరి 8వ తేదీ నుండి చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పకడ్బందీగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులను, జిల్లా నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. 8వతేదీ నుంచి సమగ్ర సర్వే మొదలవుతుందని, ఈ రెండు రోజులు ఎన్యుమరేటర్లు ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. 8 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. ఈ సర్వేలో ప్రతి కుటుంబం బుక్ లెట్ లో పొందుపరిచిన కుటుంబ వివరాలను నమోదు చేస్తారని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఫారంలో అడిగిన అంశాల ఆధారంగా అన్ని అంశాలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని, సమాచారంలో తప్పులు లేకుండా ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయి సమాచారం సర్వేలో ఉంటే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 12 మండలాలు, భూపాలపల్లి మున్సిపాలిటీ కలిపి మొత్తం 1,31,030 ఇండ్లు ఉన్నాయని, వీటి సర్వే నిమిత్తం 993 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించి 934 మంది ఎన్యూమరేటర్లు, 101 మంది సూపర్ వైజర్లను నియమించామని తెలిపారు. గణన ప్రక్రియకు నియమించిన మండల, నియోజకవర్గ, జిల్లా ప్రత్యేక అధికారులకు, సూపర్ వైజర్లుకు, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్ వాడి, విఓఎస్ సిబ్బంది సర్వే ప్రక్రియకు వినియోగిస్తున్నామని తెలిపారు. సర్వే వివరాలను ఏరోజు కారోజు డేటా ఎంట్రీ చేసేందుకు జరుగుతుందని, ఇందుకు సంబంధించి డేటా ఎంట్రీ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలాల్లో, నియోజకవర్గాల్లో సర్వే పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించా మని, క్షేత్రస్థాయిలో సర్వే తీరు పరిశీలిస్తారని, ఏదేని సమస్య వస్తే జిల్లా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సర్వేలో ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత, విద్యావివరాలు, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు, వలస వెళ్లినవారి వివరాలు సేకరణ జరుగుతుందని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి, కుల అంశాలను ప్రధానంగా ఈ సర్వేలో గుర్తించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా సర్వేలో ఎలాంటి అపోహలకు గురికావద్దని ప్రజలకు సూచించారు. సర్వే అంతా గోప్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డిఓ, నియోజకవర్గ నోడల్ అధికారి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, శ్రీనివాస్, ఎంపీడీఓ భాస్కర్, సూపర్ వైజర్ ఉష, ఎన్యూమరేటర్ సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ల కింద ప్లే గ్రౌండ్స్

హైదరాబాద్: హైదరాబాద్.. ఇరుకైన రోడ్లు, గంటల తరబడి ట్రాఫిక్ జామ్. నిత్యం ప్రయాణికులకు నరకం కనిపిస్తుంది. రద్దీని తగ్గించడానికి ఫ్లైఓవర్ల నిర్మాణం చేశారు. అయితే.. వాటి కింద ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవడానికి జీహెచ్ఎంసీ ఇప్పుడు కొత్త ఆలోచన చేసింది. ఫ్లైఓవర్ల కింద ప్లే గ్రౌండ్‌లను నిర్మిస్తోంది. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ వినూత్న ఆలోచన చేసింది. కేపీహెచ్‌బీ ఫ్లైఓవర్ కింద..నగరంలో మొట్టమొదటి సారిగా క్రీడా రంగాన్ని ఏర్పాటు చేసింది. 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో.. బాస్కెట్‌బాల్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్‌తో సహా వివిధ క్రీడలు ఆడేలా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తోంది. ఈ బహుళార్ధ సాధక క్రీడా ప్రాంగణాన్ని.. రూ.78 లక్షల వ్యయంతో ఫ్లైఓవర్ కింద నిర్మిస్తున్నారు. ఇదే కాదు.. త్వరలో ఇలాంటి మరిన్ని ప్రాంగణాల నిర్మాణాలకు ప్లాన్ చేస్తున్నారు. హైటెక్ సిటీ, ఖైత్లాపూర్, బాలానగర్ ఫ్లైఓవర్‌ల కింద కూడా ఇలాంటి ఇలాంటివి ఏర్పాటు చేయడానికి అడుగులు పడుతున్నాయి. అయితే.. ఫ్లైఓవర్ల కింద ఇలాంటి నిర్మాణాలను నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లలో ఇలాంటివి ఏర్పాటు చేస్తే.. ప్రజలు ఆ ప్రాంతంలో గుమిగూడతారని అంటున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడు తుందని చెబుతున్నారు. రోడ్ల మధ్యలో ఇలాంటివి ఉంటే.. వాహన దారులు ఇంట్రెస్ట్ డైవర్ట్ అవుతుందని.. దీంతో ప్రమాదాలు జరుగు తాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్ లను ప్రజల ప్రాణాలకు హాని కలిగించని కార్యకలాపాలకు వినియో గించాలని అర్బన్ ప్లానర్లు చెబుతున్నారు. ఏదైనా నిర్మాణ వైఫల్యం కారణంగా ఫ్లైఓవర్ కూలిపోతే.. క్రీడాకారుల ప్రాణాలు ఉంటాయా అని ప్రశ్నిస్తున్నారునగరంలో ఉన్న ఫ్లైఓవర్‌లను ప్రజల ప్రాణాలకు హాని కలిగించని కార్యకలాపాలకు వినియోగించాలని అర్బన్ ప్లానర్లు చెబు తున్నారు. ఏదైనా నిర్మాణ వైఫల్యం ఫ్లైఓవర్ కూలిపోతే.. దానికింద ఉండే క్రీడాకారుల ప్రాణాలు ఉంటాయా అని ప్రశ్నిస్తున్నారు

# వృద్ధులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్ల ఫోన్ కాల్స్

**- మోసపోతున్న వారు విశ్రాంత ఉద్యోగులే ఎక్కువ**

**సీనియర్ సిటిజన్ లను అప్రమత్తం చేసేందుకు ఈ అవగాహన కార్యక్రమం**

గోదావరిఖని: సీనియర్ సిటిజన్స్ వయసులో ఉన్నప్పుడు క్షణం తిరికలేకుండా గడిపిన ఉద్యోగులు, వ్యాపారులు. వీరిలో అత్యధికులు ఒంటరిగా ఉంటున్నారు. మాట కలిపేవారి కోసం ఆశగా ఎదురు చూస్తూ కాలక్షేపానికి సోషల్ మీడియాను ఆశ్రయిస్తుంటారు. ఈ బలహీనతనే సైబర్ నేరగాళ్ళు అవకాశంగా చేసుకొని ఫోన్లు చేస్తూ ప్రేమగా పలకరిస్తూ తరువాత సైబర్ నేరాలకు పాల్పడుతూ భయపెడుతున్నారు. కొద్ది నెలలుగా నమోదవుతున్న సైబర్ నేరాలను పరిశీలిస్తే బాధితుల్లో వృద్ధులే ఎక్కువగా ఉంటున్నారు. దాంతో వారిని చైతన్యపరచాలని ఉద్దేశ్యం తో సైబర్ జాగ్రుకత దివాస్ కార్యక్రమం లో భాగంగా డిజి షికా గోయల్ మేడమ్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ లోని మిలీనియం హల్ లో సైబర్ నేరాలపై అవగాహనా కల్పించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ముఖ్య అతిథులు హాజరై సీనియర్ సిటిజన్ లను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... ఇంటర్నెట్ ద్వారా జరుగుతున్న మోసాలపై అవగాహనా ఉండదని, సీనియర్ సిటిజన్ల పదవీ విరమణతో వచ్చిన గ్రాట్యూటీ. ఇతర సేవింగ్స్ కారణంగా వీరి ఖాతాల్లో పెద్దమొత్తంలో డబ్బుండే అవకాశముంది. ఉన్నతాధికారులైతే పించను కూడా భారీగానే ఉంటుంది. పైగా వీరి పిల్లలు చాలావరకు విదేశాల్లో ఉంటారు. ఇంకొందరు స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెడుతుంటారు. బ్యాంకు ఖాతాలో చాలా పొదుపులు ఉంటాయని, సీనియర్ సిటిజన్ లకు సాంకేతిక పరిజ్ఞానం గురించి తక్కువ జ్ఞానం ఉంటుంది కనుక వారిని మోసం చేయడం సులభం అని సైబర్ క్రిమినల్స్ ముఖ్యంగా సిటిజన్స్‌ను టార్గెట్ చేస్తున్నారు అన్నారు. స్టాక్ మార్కెట్, హోంలోన్స్, ఇన్సూరెన్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ పేర్లతో మాయ మాటలు చెప్పి మోసలకు పాల్పడుతున్నారని తెలిపారు. తాము పంపించే వీడియో లింకులకు లైక్ కొడితే చాలు ఊహించనంత డబ్బు వస్తుంది అని, అమ్మాయిలతో వీడియో కాల్ చేయించి అవతలి వ్యక్తి దాన్ని రిసీవ్ చేసుకోగానే రికార్డు చేసి బెదిరించి డబ్బులు అడగడం డబ్బు ఇవ్వపోతే వీడియోలను సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడడం దాంతో భయపడి చాలామంది డబ్బులు ఇస్తూనారు అన్నారు. ప్రస్తుత నేరాల తీరు పై అవగాహన పెంచుకోవాలి. తెలియని సంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే సమాచారం ఇవ్వొద్దు. ముఖ్యంగా వాట్సప్ వీడియో కాల్స్ కు అప్రమత్తంగా ఉండాలి. అత్యధిక లాభాలు వస్తాయనగానే అశపడొద్దు డిజిటల్ అరెస్టులకు భయపడొద్దు. ఒకవేళ మోసపోతే వెంటనే 1930 నంబరుకి ఫోన్ చేయాలి సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, సీనియర్ సిటిజన్ పిటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి..

**జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగ చంద్రయ్య డిమాండ్..**

జమ్మికుంట: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఎస్ టి ఓ ,జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగచంద్రయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎస్ టి ఓ జమ్మికుంట కార్యాలయం ముందు టా, ప్ర, రాష్ట్రశాఖ ఆదేశానుసారము పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారం కొరకు ధర్నా కార్యక్రమం నిర్వహించి ఎస్ టి ఓ, కూనమల్ల సుమన్ కుమార్, కు మెమోరాండం ఇచ్చారు, అనంతరము ఇట్టి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న టా,ప్రా, కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, గౌరవాధ్యక్షులు కట్ట నాగభూషణాచారి, మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న డి ఏ లను వెంటనే ప్రకటిస్తూ రెండవ పిఆర్సి ని ప్రకటించి జూలై 2023 నుండి అమలుపరచాలని ప్రస్తుత ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్, విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అదేవిధంగా అర్హత కలిగిన ఈపిఎస్ పెన్షనర్లకు పెన్షన్ మంజూరు చేయాలని పెన్షనర్ల కమ్యూటేషన్ తగ్గింపును 15 సంవత్సరముల నుండి 12 సంవత్సరములకు కుదించి స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేస్తూ పెన్షనర్లకు కూడా ప్రత్యేక తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు, ప్రతి జిల్లాలో వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేసి ఈ హెచ్ ఎస్, స్కీం అమలుపరుస్తూ గ్రాట్యుటీ 20 లక్షలకు పెంచుతూ పెన్షనర్లకు

మెడికల్ అలవెన్స్ 3000 రూపాయలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు, ఈ ధర్నా కార్యక్రమంలో జమ్మికుంట శాఖ గౌరవ అధ్యక్షులు శీలం మల్లేశం, కూతాడి ప్రభాకర్,ఎండి హసన్, ఎస్ సారభద్రస్వామి, జె రామచంద్రం, భోగం రాజయ్య, ఖాజా మొయినుద్దీన్, జె దేవయ్య, తదితరులు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**